ఆంధ్రజ్యోతి
పెద్దపల్లి
మంగళవారం 15 అక్టోబరు 2024 5★


పెద్దబొంకూరులో నర్సరీలోని మొక్కల వివరాలను నమోదు చేస్తున్న ఏపీవో రమేష్‌బాబు

నర్సరీల్లో మొక్కల రక్షణకు చర్యలు

- ఏపీవో రమేష్ బాబు

పెద్దపల్లి రూరల్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లో మొక్కల రక్షణకు ప్రత్యేక రక్షణ చర్యలు చేపడుతున్నట్లు ఏపీవో రమేష్‌బాబు అన్నారు.

సోమవారం మండలంలోని పెద్దబొంకూరు లోని నర్సరీని ఏపీవో రమేష్‌బాబు పరిశీలించి మొక్కల వివరాలను నమోదు చేసుకున్నారు. అలాగే రోడ్డుకు ఇరువైపులా నాటిన అవెన్యూ ప్లాంటేషన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏపీవో రమేష్‌బాబు మాట్లాడుతూ నిత్యం మొక్కలకు నీరు అందించాలని , ఎండిపోయిన మొక్కలు ఉంటే తక్షణమే వాటిని తొలగించాలని సూచించారు. వాటి స్థానంలో మళ్లీ మొక్కలు నాటాలని ఆదేశించారు. లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో వన మహోత్సవంలో భాగం గా నాటిన మొక్కలను రక్షించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టినట్లు తెలిపారు. వారి వెంట ఫీల్డ్ అసిస్టెంట్ మల్లీశ్వరి, ఉపాధి హామీ కూలీలు ఉన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

నిరుద్యోగులకు ఉపాధి కల్పించడమే లక్ష్యం

- రామగుండంలో ఐటీ, ఏఐ స్కిల్ సెంటర్ల ఏర్పాటు
- ఓసీపీల్లో స్థానికులకే ఉపాధి అవకాశాలు
- రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్

8


గుంతలమయమైన సుద్దాల- చిన్నబొంకూర్ రోడ్డు

ప్రయాణం నరకప్రాయం

- అధ్వానంగా గ్రామీణ రోడ్లు
- తరుచూ ప్రమాదాలు
- రోడ్ల మరమ్మతు చేయాలని కోరుతున్న ప్రజలు

8

న్యూస్ బాక్స్

ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

పెద్దపల్లిటౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో వచ్చిన అర్జీల ను సత్వరమే పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే అరుణశ్రీ పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా అరుణశ్రీ మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యం ఇచ్చి అర్జీదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమం లో జిల్లా, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ



తనిఖీ చేస్తున్న వ్యవసాయ అధికారి

కాల్వశ్రీరాంపూర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను మండల వ్యవసాయ అధికారి నాగార్జున సోమవారం తనిఖీ చేశారు. దుకాణాల్లోని స్టాకు రిజిస్టర్, సంబంధిత ఎరువులు, పెస్టిసైడ్లు పరిశీలించారు. నకిలీ ఎరువుల అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తగ్గేదేలే..

దసరా మద్యం కిక్కు రూ.12.58 కోట్లు..

- గత ఏడాది కంటే రూ. 2.60 కోట్ల అమ్మకాలు అదనం
- పెరిగిన 44.94 శాతం బీర్లు, 24.80 శాతం లిక్కర్ అమ్మకాలు
- బీర్లు బాగా తాగిన యువత
- ప్రభుత్వ ఖజానాకు కాసుల వర్షం



(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

దసరా పండుగను అన్నివర్గాల ప్రజలు జోష్‌గా జరుపుకున్నారు. మద్యం సేవించే విషయంలో మాత్రం తగ్గేదేలే.. అంటూ మద్యం ప్రియులు ప్రభుత్వానికి కాసుల వర్షం కురిపించారు. గత ఏడాది కంటే ఈసారి దసరాకు అదనంగా 2 కోట్ల 60 లక్షల రూపాయల విలువైన మద్యం అమ్మకాలు సాగాయి. లిక్కర్ కంటే బీర్ల అమ్మకాలు బాగా పెరిగాయి. యువత అధికంగా బీర్లను తాగినట్లు కనబడుతున్నది. తెలంగాణ ప్రాంత ప్రజలకు అతిపెద్ద పండుగ సద్దుల బతుకమ్మ, దసరా పండుగ లు. ఈ పండుగల సందర్భంగా ఇంటిల్లి పాది కొత్త బట్టలు ధరించి పండుగను ఘనంగా జరుపుకుంటారు. దసరా పండుగ అంటేనే ప్రతి ఇంట్లో ముక్క, చుక్క లేకుండా పండుగ సాగదు. ఇంట్లో మద్యం ప్రియులు ఉంటే మాత్రం కల్లు గానీ, లిక్కర్, బీరు గానీ తెచ్చుకుంటారు. ఈసారి జిల్లాలో భారీగా వర్షాలు కురిసి ప్రాజెక్టులు, నీటి వనరులు నిండడంతో పంట పొలాలు పచ్చగా కళకళలాడుతున్నాయి. వచ్చే యాసంగికి కూడా సాగు నీటికి డోకా లేకుండా పోవడంతో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ప్రజలు దసరా పండుగ, సద్దుల బతుకమ్మ పండుగను ఘనంగా జరుపుకున్నారు.

- **జిల్లాలో 76 మద్యం షాపులు..**

జిల్లాలోని పారిశ్రామిక ప్రాంతమైన గోదావరిఖని, జిల్లా కేంద్రమైన పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్, అంతర్గాం, పాలకుర్తి, రామగుండం, రామగిరి, ముత్తారం, కమాన్‌పూర్, కాల్వశ్రీరాంపూర్, ఓదెల, సుల్తానాబాద్, ఎలిగేడు, జూలపల్లి, ధర్మారం మండలాల్లో 76 మద్యం షాపులు ఉండగా, అన్ని షాపులు మద్యం అమ్మకాలతో కళకళలాడాయి. గత ఏడాది దసరా పండుగకు ముందు మద్యం రిటెయిల్ షాపుల యజమానులు, బార్ అండ్ రెస్టారెంట్ల యజమానులు తొమ్మిది కోట్ల 98 వేల రూపాయల విలువైన 9,283 లిక్కర్ (ఫుల్) బాటిళ్లు, 16,113 పెట్టెల బీర్లు అమ్ముడుపోయాయి. ఈసారి 12 కోట్ల 58 లక్షల రూపాయల విలువైన 12,343 లిక్కర్(ఫుల్), 22,414 పెట్టెల బీర్లు అమ్ముడు పోయాయని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ మహిపాల్ రెడ్డి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే అదనంగా 2 కోట్ల 60 లక్షల రూపాయల ఆదాయం మద్యం అమ్మకాల రూపేణా ప్రభుత్వ ఖజానాకు చేరడం గమనార్హం. గత ఏడాది కంటే లిక్కర్ అమ్మకాలు 24.80 శాతం అదనంగా అమ్ముడు పోగా, బీర్ల అమ్మకాలు గత ఏడాది కంటే అదనంగా 44.94 శాతం అమ్ముడు పోయాయి. యువత ఎక్కువగా బీర్లను సేవిస్తుంటారు. ఈసారి బీర్ల అమ్మకాలను చూస్తే మాత్రం యువత బీర్లను బాగానే తాగినట్లు కనబడుతున్నది. ప్రతి ఏటా మద్యం అమ్మకాలు పెరుగుతూనే ఉన్నాయి గానీ, తగ్గడం లేదు. ఒక్క పండుగల పూటనే కాకుండా సాధారణ రోజుల్లో కూడా మద్యం అమ్మకాలు బాగానే సాగుతున్నాయి. ప్రభుత్వం ఎక్సైజ్ శాఖ అధికారులకు మద్యం అమ్మకాలపై టార్గెట్లు విధిస్తుండడంతో సదరు అధికారులు మద్యం షాపుల యజమానులపై ఒత్తిడి పెంచుతున్నారు. దీంతో వారు బెల్ట్ షాపుల్లో అమ్మకాలను మరింత ప్రోత్సహిస్తున్నారు. టార్గెట్ల నేపథ్యంలో బెల్ట్ షాపులను ఎక్సైజ్ శాఖాధికారులు పట్టించుకోవడం లేదు. దీని పర్యావసానం గా ప్రతి ఏటా మద్యం అమ్మకాలు పెరుగుతూనే ఉన్నాయి తప్ప తగ్గడం లేదు. మొత్తం మీద దసరా కిక్కు బాగానే ఎక్కింది.

క్రీడల్లో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపేందుకు కృషి

- క్రీడారంగ అభివృద్ధికి సీఎం ప్రత్యేక శ్రద్ధ
- పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు


సీఎం కప్ క్రీడాజ్యోతి ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే, అదనపు కలెక్టర్

సుల్తానాబాద్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): క్రీడల్లో దేశంలోనే రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. సీఎం కప్ క్రీడా జ్యోతి ర్యాలీ పెద్దపల్లి జిల్లాలో సోమవారం ప్రవేశించింది. ఎమ్మెల్యేతో పాటు అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్‌లాల్, పలువురు క్రీడాకారులు, అధికారులు సుల్తానాబాద్‌లో ర్యాలీకి ఘనస్వాగతం పలికారు. పట్టణ శివారు శాస్త్రినగర్ వద్ద సీఎం కప్ క్రీడా జ్యోతి ర్యాలీకి స్వాగతం పలికిన అనంతరం అక్కడి నుంచి ర్యాలీ రాజీవ్ రహదారి మీదుగా సుల్తానాబాద్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానానికి చేరింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణారావు మాట్లాడుతూ క్రీడలను ప్రోత్సహించడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పని చేస్తోందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా బడ్జెట్‌లో క్రీడారంగానికి అధిక నిధులు కేటాయించడం జరిగిందన్నారు. సీఎం క్రీడలను ప్రోత్సహిస్తున్నాడని, జాతీయ అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులను తీర్చిదిద్దడం కోసం కోట్లాది రూపాయలను క్రీడలకు వెచ్చిస్తున్నారన్నారు. ఈ నెల 21 నుంచి ప్రతీ మండల, జిల్లా కేంద్రాల్లో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో తదితర క్రీడలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారని వివరించారు. కేంద్ర క్రీడాశాఖ మంత్రితో చర్చించి రాష్ట్రంలో ఒలింపిక్ క్రీడలను నిర్వహించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి అన్ని ఏర్పాట్లు చేస్తున్నారని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ గాజుల లక్ష్మీరాజమల్లు, వైస్ ఛైర్‌పర్సన్ బిరుదు సమత క్రిష్ణ, జిల్లా క్రీడల యువజన శాఖ అధికారి సురేష్, రాష్ట్రస్థాయి నోడల్ అధికారి కన్నం మధు, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ గోకుల్, నాయకులు మినుపాల ప్రకాశ్‌రావు, అంతటి అన్నయ్యగౌడ్, పన్నాల రాములు, శ్రీగిరి శ్రీనివాస్, జాతీ య, అంతర్జాతీయ క్రీడాకారులు పాల్గొన్నారు.

డిసెంబరు నాటికి
ఎన్‌సీడీ స్ర్కీనింగ్ పూర్తి చేసేలా కార్యాచరణ

- కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లిటౌన్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): డిసెంబరు వరకు ఎన్‌సీడీ(నాన్‌కమ్యూనికేబుల్ డీసీసెస్) స్ర్కీనింగ్ పూర్తి చేసేలా కార్యాచరణ పూర్తి చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో ఎన్‌సీడీ స్ర్కీనింగ్‌పై సంబంధిత అధికారులతో కలెక్టర్ సోమవారం రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎన్‌సీడీ స్ర్కీనింగ్ ప్రక్రియ డిసెంబరు వరకు పూర్తి చేసేలా పటిష్ఠ కార్యాచరణ రూపొందించి రెండు రోజుల్లో అందజేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా ఆసుపత్రిలో పాలేటివ్ కేర్ సేవల వివరాలను కలెక్టర్ తెలుసుకొని వాటిని మెరుగుపరిచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రమోద్‌కుమార్, ప్రోగ్రాం అధికారి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వ పథకాలు



అవగాహన కల్పిస్తున్న మహిళ సాధికారత కేంద్రం సభ్యులు

పెద్దపల్లి రూరల్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం అనేక రకాల పథకాలు ప్రవేశపెడుతోందని, అందులో భాగంగానే మిషన్ శక్తి ద్వారా స్వయం ఉపాధి పొందేందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని తీసుకొచ్చిందని మహిళ సాధికారిత కేంద్రం జెండర్ స్పెషలిష్ట్ చంద్రు స్వప్న, ఫైనాన్స్ లిట్రసీ సేరు సంధ్యారాణి అన్నారు. సోమవారం మండలంలోని రాఘవపూర్‌లో ఉషోదయ గ్రామైక్య సంఘం సమావేశం నిర్వహించగా మహిళ సాధికారిత కేంద్రం ఆధ్వర్యంలో మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆడపిల్లల సంఖ్య రోజురోజుకు తగ్గిపోతుందని ఆడపిల్లల రేటును పెంచడం కోసమే బేటీ బచావో బేటి పడావో ముఖ్య ఉద్దేశమన్నారు. మహిళలు, ఆడపిల్లల రక్షణ కోసం ప్రభుత్వం అనేక చట్టాలు తీసుకురావడంతో పాటు ప్రత్యేక శాఖలను తీసుకొచ్చిందన్నారు. సఖీ కేంద్రం, చైల్డ్ హెల్ప్‌లైన్, భరోసా, షీ టీం వంటి భద్రత కేంద్రా లు, చట్టాలు, హెల్ప్‌లైన్ నంబర్లపై అవగాహన కల్పించారు. ఆర్థిక అక్షరాస్యతతోనే మహిళా సాధికారత సాధ్యమని సూచించారు. కార్యక్రమంలో వీవోఏ తిరుమల, కార్యదర్శి గౌతమి, కోశాధికారి గంగ, మహిళ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా దుర్గా మాత నిమజ్జనోత్సవం


కమాన్‌పూర్‌లో నిమజ్జనానికి తరలుతున్న దుర్గాదేవి

పెద్దపల్లి రూరల్/కమాన్‌పూర్ అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి మండలంలోని చీకురాయిలో, కమాన్‌పూర్ మండల కేంద్రంలో ఛత్రపతి శివాజి యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత నిమజ్జనోత్సవం సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. తొమ్మిది రోజులపాటు యువకులు భవాని దీక్షను స్వీకరించి పూజలు నిర్వహించారు. నవ అవతారాల్లో దర్శనమిచ్చిన దుర్గమాత వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామగ్రామాన దుర్గమాత విగ్రహాలను ప్రతిష్ఠించి యువకులు, యువతులు భక్తిని చాటారు. నవరాత్రులు ముగింపు సందర్భంగా గ్రామాల్లో దుర్గామాత విగ్రహాలను శోభాయాత్ర నిర్వహించి నిమజ్జనం చేశారు. శోభాయాత్రలో యువకులు, మహిళలు, యువతులు గేయాలను ఆలపిస్తూ దాండియా, కోలాటంతో నిమజ్జనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ కొట్టే ప్రసాద్ బందోబస్తు నిర్వహించారు.

ప్రయాణికులతో కిటకిటలాడిన 'ఖని' బస్టాండ్

- బస్సులు లేక ఇబ్బందులు
- అదనంగా 37సర్వీసులను నడిపించినా తగ్గని రద్దీ


ప్రయాణికులతో కిక్కిరిసిన గోదావరిఖని ఆర్‌టీసీ బస్టాండ్

కళ్యాణ్‌నగర్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): దసరా పండుగ సందర్భంగా గోదావరిఖని ఆర్టీసీ బస్టాండ్ కిటకిటలాడింది. ఉదయం నాలుగు గంటల నుంచే ప్రయాణికుల తాకిడి పెరిగింది. దసరా పండుగ సందర్భంగా వివిధ ఊళ్ల నుంచి సొంత గ్రామాలకు వచ్చిన వారు తిరుగుముఖం పట్టడంతో ప్రయాణికులతో కిక్కిరిసిపోయింది. సమయానికి బస్సులు రాక గంటల తరబడి ప్రయాణికులు వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎక్స్‌ప్రెస్ బస్సులు తగ్గడం, సూపర్ లగ్జరీ, డీలక్స్ బస్సులు పెంచడంతో మహాలక్ష్మి పథకం కింద ప్రయాణించాల్సిన మహిళలు బస్సుల కోసం వేచి చూశారు. హైదరాబాద్, కరీంనగర్, భూపాలపల్లి, మంచిర్యాల రూట్లలో సర్వీసుల కోసం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గోదావరిఖని బస్టాండ్ నుంచి హైదరాబాద్‌కు రోజు 34సర్వీసులు నడుస్తున్నప్పటికీ అదనంగా మరో 37సర్వీసులను పెంచారు. బస్సులు లేకపోవడంతో చాలా మంది ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించారు. మూడు నాలుగు రోజులుగా ప్రయాణికులతో గోదావరిఖని బస్టాండ్ రద్దీగా మారింది.

- **ఖని డిపోకు రూ.33లక్షల ఆదాయం...**

గోదావరిఖని ఆర్టీసీ డిపోకు ఆదివారం ఒక్క రోజే రూ.33లక్షల ఆదాయం వచ్చిందని డిపో మేనేజర్ నాగభూషణం తెలిపారు. అదనంగా 37బస్సులను నడిపినట్లు, ప్రయాణికులకు తమ తమ గమ్యస్థానాలకు సురక్షితంగా చేరవేసినట్లు ఆయన చెప్పారు. రెగ్యులర్ సర్వీసులతో పాటు ఇతర రూట్లలో సర్వీసులను కూడా అదనంగా నడిపినట్లు ఆయన పేర్కొన్నారు.

రామగుండం కార్పొరేషన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా ఆసిఫ్ పాషా


నియామక పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కళ్యాణ్‌నగర్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ రామగుండం కార్పొరేషన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా ఆసిఫ్ పాషాను నియమిస్తూ సోమవారం రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామగుండం కార్పొరేషన్‌లో ముస్లింల సంక్షేమానికి కృషి చేస్తానని, తన నియామకానికి కృషి చేసిన మంత్రి శ్రీధర్ బాబు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మహంకాళి స్వామి, ఎండీ ముస్తాఫా, ఫజల్‌బేగ్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పుట్ట మధు పరామర్శ

మంథని, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): స్థానిక పుట్ట లింగమ్మ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ముక్తి ఆశ్రమ్‌లో ఇటీవల మృతి చెందిన అబ్బెజు సముద్రమ్మ కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు పరామర్శించారు. మండలంలోని రచ్చపల్లి గ్రామానికి చెందిన అబ్బెజు సముద్రమ్మ పెద్దపల్లి జిల్లా కేంద్రంలో అద్దె ఇంట్లో ఉంటూ ఇటీవల మృతి చెందారు. అంతిమ కార్యక్రమాలకు ఇంటి యాజమాని నిరాకరించడంతో కుటుంబ సభ్యులు స్థానిక ముక్తి ఆశ్రమ్‌లో అంతమ కార్యక్రమాలు నిర్వహించుకుంటున్నారు. ముక్తి ఆశ్రమ్‌లో ఆమె కుటుంబాన్ని పుట్ట మధు పరామర్శించి సముద్రమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

రేపు జిల్లా స్థాయి సాఫ్ట్‌బాల్ సబ్ జూనియర్స్ ఎంపిక పోటీలు

మార్కండేయకాలనీ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి సాఫ్ట్‌బాల్ సబ్ జూనియర్స్ ఎంపిక పోటీలు ఈ నెల 16న గోదావరిఖని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించనున్నట్లు జిల్లా అసోసియేషన్ నిర్వహణాధికారి బాషబోయిన వాసు ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పాల్గొనే వారు 01-01-2010 నుంచి 01-01-2014 మధ్య జన్మించి ఉండాలని, పూర్తి వివరాలకు 8919885111 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు. ఈ పోటీల్లో ఎంపికైన వారు ఈ నెల 18 నుంచి 20వరకు వరంగల్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

అనారోగ్యంతో ఏఐటీయూసీ నాయకుడి మృతి

కోల్‌సిటీ, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): రామగుండం రీజియన్ ఏఐటీయూసీ నాయకుడు మోదుల సంపత్ (52) అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. గోదావరిఖని ఉదయ్‌నగర్‌లో నివాసముండే సంపత్ ఇటీవల అనారోగ్యానికి లోనయ్యాడు. రక్తకణాలు పడిపోవడంతో సింగరేణి ఏరియా ఆసుపత్రి నుంచి కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ అస్పత్రికి కుటుంబసభ్యులు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. సంపత్‌కు జీడీకే11లో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ పిట్ సెక్రటరీగా పనిచేస్తున్నాడు. సంపత్ మృతిపై ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్, ఏఐటీయూసీ నాయకుడు సీతారమయ్య సంతాపం తెలిపారు.

రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక

ముస్తాబాద్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయిలో నిర్వహించే క్రికెట్ పోటీలకు స్థానిక మహర్షి పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న కొండం సాయి తేజాగౌడ్ ఎంపికయ్యాడు. ఎస్‌జీఎఫ్ క్రీడల్లో అండర్-14 విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరి చాడు. ప్రస్థాయి ఎ తోట ధర్మేందర్, పీఈటీ, ఉపాధ్యాయులు అభినందించారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు

సిరిసిల్ల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల లక్ష్మీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్స వాలు అత్యంత వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం మూడు వాహనాలపై స్వామివారి శోభాయాత్ర నిర్వహించారు. ఉదయం సూర్యవాహనం, సాయంత్రం రంగనాయక తిరుప్పాలం, రాత్రి చంద్రవాహనంపై ఊరేగించారు.



న్యూస్ బాక్స్

ఉద్యోగాల భర్తీకి 17న ఇంటర్వ్యూలు

కరీంనగర్ టౌన్, అక్టోబరు 14: తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్‌కామ్) ఈనెల 17న ఉదయం 9 గంటలకు హోటల్ శ్వేతలో దుబాయ్‌లో ఉద్యోగాల భర్తీ కోసం ఇంటర్వ్యూలను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్, టామ్‌కామ్ సీఈవో ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. దుబాయ్‌లో బైక్ రైడర్స్ (డెలివరీ బాయ్స్)కి అధిక డిమాండ్ ఉందని అన్నారు. ఆకర్షణీయమైన జీతం, చట్టబద్ధమైన వలస మార్గాల ద్వారా భర్తీ ప్రక్రియను సులభతరం చేయడంలో టామ్‌కామ్ అభ్యర్థులకు సహాయం చేస్తుందని అన్నారు. ఎస్సెస్సీ ఉత్తీర్ణులై పాస్‌పోర్టు, మూడు సంవత్సరాల ఇండియన్ డ్రైవింగ్ లైసెన్సు కలిగి 21 నుంచి 40 సంవత్సరాలలోపు వయస్సుతో పాటు జోమాటో, స్విగ్గీ, మరేదైనా ఫుడ్ డెలివరీలో అనుభవం ఉన్న వారికి ఉద్యోగ భర్తీలో ప్రాధాన్యత ఉంటుందని చెప్పారు. అర్హత కలిగిన వారు 9440061285, 9440048500, 9701040062, 9440051452 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

అంబేద్కర్ ఓపెన్ డిగ్రీ ప్రవేశానికి నేడు తుది గడువు

గణేశ్‌నగర్, అక్టోబరు 14: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం 2024-25 విద్యా సంవత్సరానికి డిగ్రీ మొదటి సంవత్సరం అడ్మిషన్లకు మంగళ వారం తుది గడువని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.వరలక్ష్మి, కోఆర్డినేటర్ డా.మనోజ్‌కుమార్ సోమ వారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీ డియట్ ఓపెన్‌స్కూల్, ఐటీఐ, డిప్లొమా విద్యార్థులు, టీఎస్ ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసి రశీదు పొందాలని సూచించారు. ఇతర సమాచారం కోసం 7382929755 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

ఎల్‌ఎల్‌ఎం ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, అక్టోబరు 14: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో ఆగస్టు 2024లో నిర్వహించిన ఎల్‌ఎల్‌ఎం నాలుగో సెమిస్టర్ పరీక్ష ఫలితాలను సోమవారం శాతవాహన విశ్వ విద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎన్‌వీ శ్రీరంగ ప్రసాద్ విడుదల చేశారు. పరీక్షల ఫలితాలు శాతవాహన యూని వర్సిటీ వెబ్‌సైట్ www.satavahana.ac.in.లో చూసుకోవచ్చని తెలిపారు.

అలసిపోతున్న పోలీసన్న..

- హామీగానే మిగిలిపోయిన వారాంతపు సెలవు
- పూర్తి స్థాయి సిబ్బందిని భర్తీ చేస్తేనే సాధ్యం...
- పట్టణాల్లో 16 గంటలు, మండలాల్లో 24 గంటల విధులు

ఉద్యోగపర్వం





రోజుకు 16 గంటలు, అవసరం ఉన్నప్పుడు 24 గంటలు.. ఇలా పోలీసులు అలుపెరుగకుండా విధులు నిర్వహిస్తూనే ఉన్నారు. ఎన్నో ఏళ్లుగా అధికారులు, ప్రజాప్రతినిధులు అంటున్నట్లు పోలీసులకు వారాంతపు సెలవు అమలుకావడం లేదు. రాత్రనకా.. పగలనకా పని చేస్తున్న పోలీసులు అలసిపోతున్నారు. ఇది వారి ఆరోగ్యంపై ప్రభావం చూపుతోంది.

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 14: పోలీసులకు వారాంతపు సెలవు హామీగానే మిగిలి పోయింది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హామీ ఇచ్చినా అది అమలుకు నోచుకోలేదు. గతంలో ఉమ్మడి జిల్లాలో కొన్ని రోజులు, కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ ఏర్పాటు చేసిన తర్వాత 2021-22లో మూడు నెలలు మాత్రమే పోలీసులకు వారాంతపు సెలవులు అమలు చేశారు. ఆ తర్వాత అమలు చేయక చేతులెత్తేశారు. వారాంత సెలవు ఇవ్వాలని పోలీసు అసోసి యేషన్లు ఎన్నో ఏళ్లుగా డిమాండ్ చేస్తున్నాయి. పోలీసు శాఖలో కానిస్టేబుల్ స్థాయి నుంచి ఏఎస్‌ఐ స్థాయి వరకు తగిన సిబ్బంది లేక, ఎమర్జెన్సీ సర్వీసులు అందించాల్సిన బాధ్యతాయుతమైన ఉద్యోగులు కావడంతో ప్రభుత్వాలు వారాంత సెలవు డిమాండ్‌ను పక్కనపెడుతూ వస్తున్నాయి. హైదరాబాద్ జంట నగరాల్లో 3, 4 సెక్షన్లలో విధులను అమలు చేస్తున్నారు. దీంతో అక్కడి పోలీసులకు కొంత వెసులుబాటు లభిస్తుండగా కరీంనగర్, జగిత్యాల, గోదావరిఖని వంటి నగరాలలో రెండు, మూడు సెక్షన్ల డ్యూటీలను అమలు చేస్తున్నారు. దీంతో పోలీసులు రోజుకు దాదాపు 16 గంటలపాటు విధులు నిర్వహిస్తున్నారు. ఇక బందోబస్తులున్న రోజుల్లో 24 గంటల విధులు నిర్వహించాల్సి వస్తుంది. ఇక గ్రామీణ ప్రాంతాల స్టేషన్లలో పని చేస్తున్న వారు 24 గంటలపాటు విధులు నిర్వహిస్తున్నారు.

500 మందికి ఒక పోలీసు..

ప్రతి 500 జనాభాకు ఒక పోలీసు నిష్పత్తిలో సిబ్బంది ఉండాలని నిబంధనలు చెబుతున్నాయి. కరీంనగర్ జిల్లా జనాభా 10 లక్షలపైగా ఉండగా పోలీసుశాఖలో 1500 వరకు సిబ్బంది ఉన్నట్లు సమాచారం. జిల్లాలో రోజు రోజుకు నేరాల సంఖ్య పెరుగుతుండడం, నగరం, పట్టణాల విస్తీర్ణం పెరుగుతోంది. ఇటువంటి పరిస్థితుల్లో సమాజంలో శాంతిభద్రతల సమస్యలను కాపాడడంలో పోలీసులు శక్తికి మించి, నిర్దిష్ట సమయానికి మించి శ్రమిస్తున్నారు. వారాంతపు సెలవులు లేకుండా నిర్విరామంగా ఏడు రోజుల పాటు పని చేస్తుండడంతో పని భారం ఎక్కువవుతున్నది. వారాంతపు సెలవు ఇవ్వడంతో కొంత విశ్రాంతి లభించడం ద్వారా విధి నిర్వహణలో మరింత నైపుణ్యాన్ని చాటే అవకాశముంది.

నా జర్నీ తిరిగి ప్రారంభమైంది..

చిట్‌చాట్



కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ సంస్థ చైర్మన్ బాధ్యతలు స్వీకరించడంతో నా జర్నీ కరీంనగర్‌లో తిరిగి స్టార్ట్ అయ్యింది. నేను గంగాధర మండలం కొలిమికుంట గ్రామానికి చెందిన సాధారణ వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చాను. డిగ్రీ తర్వాత విద్య విలువ తెలిసింది. పట్టుదలతో చదివి ఎంకామ్, పిహెచ్‌డీ పూర్తి చేశాను. కీ టూ సక్సెస్ ఫర్ కామర్స్ అనే బుక్ రాశాను. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా నెలకు రూ. 1.5 లక్షలు సంపాదించాను. ఆ ఉద్యోగాన్ని వదిలి 2013లో రాజకీయాల్లోకి వచ్చాను.

నా రాజకీయ జీవితమంతా ఆదిలాబాద్ జిల్లాతో ముడి పడి ఉంది. అందుకే కరీంనగర్‌తో తక్కువ పరిచయం ఉంది. చిత్తశుద్ధి, నిజాయితీ, బాధ్యతతో పని చేయడం నా నైజం. గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవి కావాలని అడుగలేదు. వద్దని అనలేదు. అందరికీ అందుబాటులో ఉండి రాజకీయ పరంగా ప్రభుత్వం తరపున సహాయం అందించేందుకు కృషి చేస్తాను. త్వరలో అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించి అన్ని వివరాలు తెలుసుకుంటా. బడ్జెట్ ఉన్నా లేకున్నా నెల రోజుల్లో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు20 లక్షల రూపాయలతో మెటీరియల్ అందజేస్తా.

- మీడియాతో చిట్‌చాట్‌లో కరీంనగర్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లయ్య

రాజన్న ఆలయ అభివృద్ధిపై ప్రభుత్వ ప్రత్యేక దృష్టి



పూర్ణకుంభంతో మంత్రికి స్వాగతం పలుకుతున్న అర్చకులు

వేములవాడ కల్చరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయ అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించిందని, యాదాద్రి తరహాలో రాజన్న ఆలయాన్ని తీర్చిదిద్దుతామని దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. మనువడి పుట్టు వెంట్రుకల కార్యక్రమంలో భాగంగా సోమవారం కుటుంబ సమేతంగా రాజన్నను దర్శించుకున్నారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి రాజన్న ఆలయ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారని, ఈ నెల లేదా వచ్చే నెలలో సమావేశం ఏర్పాటు చేయనున్నారని తెలిపారు. యాదాద్రి ఆలయం మాదిరి గానే రాజన్న ఆల యాన్ని అభివృద్ధి చేయాలనే లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. యాదాద్రికి 63 కిలోల బంగారు తాపడం చేయడానికి జీవో మంజూరు చేసినట్లు గుర్తు చేశారు. ప్రస్తుతం వేములవాడ రాజన్న ఆలయానికి సంబంధించి 65 కిలోల బంగారం, 5 వేల కిలోల వెండి ఉందని, రాజన్నకు సైతం బంగారు తాపడం, ఉత్సవ విగ్రహాలు, పల్లకి వంటి వాటిని వెండితో తయారు చేయించి ప్రత్యేక తీసుకొస్తామని అన్నారు. ఆమెతోపాటు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

రాజన్న సేవలో మంత్రి

వేములవాడ రాజరాజేశ్వరస్వామిని దేవదాయ శాఖ మంత్రి కొండ సురేఖ దర్శించుకున్నారు. సోమవారం మధ్యాహ్నం రాజన్న ఆలయానికి కుటుంబ సభ్యులతో కలిసి వచ్చిన ఆమెకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ అఖిల్‌మహాజన్ స్వాగతం పలికారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. రాజన్న ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలుకగా రాజన్న ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. అనంతరం స్వామివారికి కోడెమొక్కు చెల్లించుకున్నారు. ఆలయ మండపంలో అర్చకులు ఆశీర్వదించగా, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. అనంతరం బద్ది పోచమ్మ అమ్మవారికి బోనం మొక్కులు చెల్లించుకున్నారు.

రాజన్న ఆలయ అధికారుల అత్యుత్సాహం

మంత్రి రాకతో స్వామివారికి అరగంట ఆలస్యంగా నైవేద్యం

వేములవాడ కల్చరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయ అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించారు. సోమవారం దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ రాజన్న ఆలయానికి కుటుంబసమేతంగా వచ్చారు. ఆలయ గెస్ట్‌హౌస్‌లో మనుమడి తలనీలాలు సమర్పించి మధ్యాహ్నం 3 గంటలకు రాజన్న దర్శనానికి వెళ్లారు. ద్వాదశి సందర్భంగా అధికారులు 3 గంటలకు స్వామివారికి నైవేద్యం, అన్నపూజ కార్యక్రమాన్ని నిర్వహించాలి. అదే సమయంలో మంత్రి దైవ దర్శనానికి రావడంతో చేసేదేమీ లేక అధికారులు మంత్రి కొండా సురేఖ ప్రత్యేక పూజలు చేసేందుకు ఏర్పాట్లు చేశారు. రాజన్నకు 3 గంటలకు నిర్వహించాల్సిన నైవేద్యం, అన్నపూజ కార్యక్రమాన్ని అరగంట ఆలస్యంగా నిర్వహించారు. రాజన్నకు సమర్పించే నైవేద్యం ఆలస్యమవడంతో భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఆలయాధికారులను వివరణ కోరగా స్వామివారికి నైవేద్యం, అన్నపూజ కార్యక్రమం నిర్వహించడం కాస్త ఆలస్యమైందని తెలిపారు. ద్వాదశి సందర్భంగా 5 గంటలకు వరకు నైవేద్యం పెట్టవచ్చని పేర్కొన్నారు.

చెక్ డ్యాంలలో ఇసుక మేటలు



పేరుకుపోయిన ఇసుక

కరీంనగర్ రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నీటిని ఒడిసి పట్టి, తాగు, సాగు నీటి సమస్యలను పరిష్క రించేందుకు కరీంనగర్ నియోజకవర్గంలో ఎనిమిది చెక్ డ్యాంలను నిర్మించారు. ఆ చెక్‌డ్యాంలలో ఇసుక పేరుకుపోవడంతో నీరు నిలవడం లేదు. కరీంనగర్ మండలం నగునూర్ గ్రామంలో వాగుపై ఐదు సంవత్సరాల క్రితం చెక్ డ్యాంను నిర్మించారు. ఈ చెక్ డ్యాంలో ప్రస్తుతం నీరు లేక వెలవెలబోతోంది. ఇసుక పేరుకు పోవడంతో నీరు చెక్ డ్యాంలో నిలువలేక దిగువకు వృథాగా పోతోంది. ఈ చెక్‌డ్యాంలో నీరుంటే నగునూర్, తీగలగుట్టపల్లి, వల్లంపహాడ్ గ్రామాల్లోని రైతులకు సాగునీటి ఇబ్బంది ఉండేది కాదు. చెక్ డ్యాంలో పేరుకుపోయిన ఇసుకను తొలగించి నీరు నిల్వ ఉండేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

నగునూర్ చెక్ డ్యాం



స్మార్ట్ కార్డుల కొరత

- గత నెల 29 నుంచి నిలిచిన ఆర్సీల ప్రింటింగ్
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇబ్బందులు

ఈ నెల 11వ తేది వరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిలిచిన స్మార్ట్ కార్డుల వివరాలు

కార్యాలయం	ఆర్సీ	డ్రైవింగ్ లైసెన్స్
కరీంనగర్	789	249
పెద్దపల్లి/ రామగుండం	360	545
రాజన్న సిరిసిల్ల	00	186
జగిత్యాల/ కోరుట్ల	1483	696
మొత్తం	2,632	1676



పోస్ట్ చేసేందుకు సిద్ధంగా ఉన్న డ్రైవింగ్ లైసెన్స్‌లు



ఆర్సీ కార్డులు(ఫైల్)

తిమ్మాపూర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రవాణా శాఖా కార్యాలయాల్లో స్మార్ట్ కార్డుల కొరత వాహనదారులకు ఇబ్బందిగా మారింది.. వాహనాలను రిజిస్ట్రేషన్ చేసుకొని, డ్రైవింగ్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారు సకాలంలో కార్డులు లభించక ఇబ్బందులు పడుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కరీంనగర్‌లో డీటీసీ కార్యాలయం, హుజూరాబాద్, పెద్దపల్లి, రామగుండం, సిరిసిల్ల, జగిత్యాల, కోరుట్లలో ఆర్టీవో కార్యాలయాలున్నాయి. వీటి పరిధిలో ఆర్సీలు, డ్రైవింగ్ లైసెన్స్‌లు కోసం రోజుకు వెయ్యి వరకు దరఖాస్తులు వస్తుంటాయి. ఆయా కార్యాలయాల్లోనే సిబ్బంది కార్డులు ప్రింట్ చేసి పోస్ట్ చేస్తారు. కార్డులు జారీ అయిన 15 రోజుల్లో వాహనదారులకు చేరాలి. స్మార్ట్ కార్డుల కొరత కారణంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గత నెల 29 నుంచి ఆర్సీ కార్డుల ప్రింటింగ్ నిలిచిపోయింది. డ్రైవింగ్ లైసెన్స్ కార్డులు కొన్న ఉండడంతో వాటిని నెట్టుకొస్తున్నారు. అవీ త్వరలో నిలిచేపోయే అవకాశం ఏంది. ఆర్సీ కార్డుల కొరత వల్ల కొత్త వాహనాలకు నంబర్ ప్లేట్లను బిగించడానికి వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.

ఆర్టీఏ ఎం-వాలెట్‌పై అవగాహన కరువు

రాష్ట్ర ప్రభుత్వం రవాణా శాఖ ఆధ్వర్యంలో ఎం-వాలెట్‌ను అందుబాటులో తీసుకువచ్చి చాలాకాలం కావస్తున్నా వాహనదారులకు అవగాహన రాలేదు. ఎం వాలెట్‌లో ఆర్సీలు, డ్రైవింగ్ లైసెన్స్ డౌన్‌లోడ్ చేసుకుంటే ఎవరైనా వాహనాలు ఆపినప్పుడు వాటిని చూపించే అవకాశం ఉంటుంది.

త్వరలో స్మార్ట్ కార్డులు అందుబాటులోకి వస్తాయి

డీటీసీ పి పురుషోత్తం



రాష్ట్ర వ్యాప్తంగా స్మార్ట్ కార్డుల కొరత ఉంది. రవాణా శాఖ ఆధ్వర్యంలో కొత్తగా టెండర్లు పిలిచారు. రాష్ట్ర వ్యాప్తంగా త్వరలో 60 వేల స్మార్ట్ కార్డులు అందుబాటులోకి వస్తాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు రెండు, మూడు రోజుల్లో స్మార్ట్ కార్డులు వస్తాయి. అవి రాగానే పెండింగ్‌లో ఉన్న ఆర్సీ డ్రైవింగ్ లైసెన్స్‌కు సంబంధించి స్మార్ట్ కార్డులను జారీ చేస్తాం.

30న బీసీ సంఘాల సమావేశం

గణేశ్‌నగర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా అన్ని రాజకీయ పార్టీలు బీసీ అభ్యర్థులకే టికెట్లు కేటాయించాలని ఈనెల 30న బీసీ సంఘాల సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెసిపెద్ది శ్రీధర్‌రాజు తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీలకు టికెట్లు కేటాయించిన వారికే తమ మద్దతు ఉంటుందని ఆయన తెలిపారు.


అదుపు తప్పి ట్రాక్టర్ బోల్తా

తిమ్మాపూర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొగిళిపాలెం గ్రామ శివారులో సోమవారం ఓ ట్రాక్టర్ అదుపు తప్పి వ్యవసాయ పొలంలో బోల్తా పడింది. పర్లపల్లి గ్రామానికి చెందిన ట్రాక్టర్‌ను డ్రైవర్ బాగోతం కొమురయ్య మొగిళిపాలెం నుంచి కరీంపేటకు తీసుకొని వెళ్తుండగా ట్రాక్టర్ అదుపుతప్పి మొగిళిపాలెం గ్రామ శివారులో పాకాల శ్రీనివాస్ పొలంలోకి దూసుకెళ్లింది. దీంతో డ్రైవర్ కొమురయ్య ట్రాక్టర్‌పై నుంచి దూకి తప్పించుకోవడంతో ప్రాణాపాయం తప్పింది.

స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

భగత్‌నగర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం తక్షణమే పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రైవేట్, డిగ్రీ, పీజీ కళాశాల యాజమాన్యాలతో చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించాలన్నారు. రాష్ట్రంలో ఆరేళ్ల నుంచి 8 వేల కోట్లకు పైగా పెండింగ్‌లో ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ పెండింగ్‌లో ఉన్నాయన్నారు. తక్షణమే విడుదల చేయాలని లేకుంటే ఎస్‌ఎఫ్‌ఐ పక్షాన రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

రేపటి నుంచి కరీంనగర్-పూణేకు ప్రత్యేక రైలు



కరీంనగర్ రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ నుంచి పుణే స్పెషల్ రైలును బుధవారం నుంచి నడిపించేందుకు రైల్వే అధికారులు చర్యలు చేపట్టారు. వారానికి ఒకసారి ఈ స్పెషల్ రైలు నడపనున్నారు. ప్రతి బుధవారం కరీంనగర్ రైల్వే స్టేషన్ నుంచి బయలుదేరి వయా పెద్దపల్లి, మంచిర్యాల, కాగజ్‌నగర్, బల్లర్షా, మాంజిరి, ఆదిలాబాద్ మీదుగా పుణేకు వెళ్తుంది. రైలు కరీంనగర్ నుంచి బుధవారం ఉదయం 6గంటలకు బయలు దేరి 7.15గంటలకు మంచిర్యాలకు, 8.50 గంటలకు కాగజ్‌నగర్‌కు, మధ్యాహ్నం 1.45 గంటలకు ఆదిలాబాద్‌కు చేరుకుంటుంది. గురువారం ఉదయం 9.45 గంటలకు పుణేకు చేరుకుంటుందని రైల్వే అధికారులు తెలిపారు. పుణే రైల్వే స్టేషన్ నుంచి కరీంనగర్‌కు వచ్చే రైలు సోమవారం రాత్రి 10.46గంటలకు బయలు దేరి మంగళవారం సాయంత్రం 4గంటలకు ఆదిలాబాద్, రాత్రి 10.45 గంటలకు సిర్పూర్ కాగజ్‌నగర్‌కు, 11.45 గంటలకు మంచిర్యాలకు చేరుకుంటుంది. రైలు రాత్రి 12.50 గంటలకు కరీంనగర్‌కు చేరుకుటుందని అధికారులు తెలిపారు.

విద్యుదాఘాతంతో వృద్ధురాలికి గాయాలు

చిగురుమామిడి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉల్లంపల్లి గ్రామానికి చెందిన సయ్యద్ జోరబీ (70) అనే వృద్ధురాలు సోమ వారం విద్యుదాఘాతంతో తీవ్రంగా గాయ పడింది. జోరబీ గ్రామ శివారులోని తుర్క కుంట వద్దకు కట్టెల కోసం వెళ్లింది. కుంట వద్ద వ్యవసాయ బావులకు సరఫరా అయ్యే విద్యుత్ తీగ తెగిపడింది. కుంట వద్ద కట్టెలు తీస్తున్న సమయంలో విద్యుత్‌వైర్ తాకి తీవ్రం గా గాయపడింది. దేవీ నవరాత్రుల సందర్భం గా అమ్మవారిని నిమజ్జనం చేయడానికి కుంట వద్దకు వెళ్లిన యువకులు గమనించి వెంటనే ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆఫ్ చేసి వృద్ధురాలిని ఆస్పత్రికి తరలించారు. గమనించకుండా యు వకులు నీటిలోకి దిగితే ప్రాణాపాయం ఉండే దని గ్రామస్థులు పేర్కొంటున్నారు. వృద్ధురాలికి విద్యుత్ శాఖ నుంచి వైద్య ఖర్చుల కోసం ఆర్థికసాయం అందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.





వ్యర్థాలతో నిండిపోయిన తీగలగుట్టపల్లిలో ఎస్సారెస్పీ కాలువ, బొమ్మకల్ గ్రామ శివారులో ఎస్సారెస్పీ కాలువలో పడేసిన చెత్త చెదారం

కాలువల్లో కాలుష్యం

ఎస్సారెస్పీ కాలువల్లో వ్యర్థ పదార్థాలు

కరీంనగర్ రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలంలోని ఎస్సారెస్పీ కాలువలు మురికి కూపాలుగా మారుతున్నాయి. చెత్త చెదారం, వ్యర్థాలతో కాలువలు కంపుకొడుతున్నాయి. మండలంలో పలు గ్రామాలను కలుపుతూ ఎస్సారెస్పీ కాలువలు ఉన్నాయి. ఈ కాలువల నుంచి ఆయా గ్రామాల్లోని పొలాల్లోకి సాగునీరు చేరుతుంది. కరీంనగర్ శివారులోని తీగలగుట్టపల్లి, బొమ్మకల్ గ్రామాల్లోని కాలువల్లో చెత్తాచెదారం పేరుకుపోయింది. కొందరు కాలువలపై ఎలాంటి అనుమతులు లేకుండా కల్వర్టులను నిర్మిస్తున్నారు. తీగలగుట్టపల్లి, బొమ్మకల్ గ్రామ శివారులోని కాలువల్లో వ్యర్థ పదార్థాలను పడేస్తున్నారు. సంబంధిత అధికారులు కాలువల్లో పేరుకుపోయిన సిల్ట్‌ను, పిచ్చి మొక్కలను తొలగించాలని, నీరు కలుషితం కాకుండా చర్యలు చేపట్టాలని రైతులు, గ్రామస్థులు కోరుతున్నారు.

లైఫ్‌స్టైల్

పల్లె.. పట్టణం.. తేడా లేకుండా మిద్దె తోటల ఏర్పాటుపై ఆసక్తి చూపుతున్నారు. ఎవరిళ్లపై వారు సేంద్రియ పద్ధతిలో కూరగాయల సాగు చేస్తున్నారు. మొదటి రెండు సంవత్సరాలు పెట్టుబడి పెట్టాల్సి వచ్చినా దిగుబడి ప్రారంభమైన తర్వాత సంతోషపడుతున్నారు. ఇళ్లపైన మొక్కల పెంపకంతో ఇంటిలోపల ఉష్ణోగ్రత తగ్గిందని, స్వచ్ఛమైన గాలితో ఆరోగ్యంగా ఉంటున్నామని మిద్దెతోటలు పెంచుతున్నవారు అంటున్నారు.


యుగంధర్ ఇంటిపైన సాగు చేస్తున్న కూరగాయల మొక్కలు

పల్లె నుంచి పట్టణం వరకు

మిద్దెతోటల హవా

- ఇళ్లపై కూరగాయల సాగు
- సేంద్రియ పద్ధతుల్లో మొక్కల పెంపకం

కరీంనగర్ అర్బన్, అక్టోబరు 14: కరీంనగర్‌లో మిద్దెతోటల పెంపకం ఇటీవలి కాలంలో పెరిగింది. ఓపిక, తీరిక, కూరగాయలు, పండ్లు పెంపకంపై ఆసక్తి ఉంటే చాలు మిద్దెతోటల పెంపకాన్ని చేపట్ట వచ్చు. సేంద్రియ విధానంలో మిద్దెతోటలో పంటల సాగుతో ఆరోగ్య కరమైన కూరగాయలు, ఫలాలు పొందుతున్నారు. కరీంనగర్‌కు చెందిన జనగాని యుగంధర్ తన ఇంటిపై మిద్దెతోట ఏర్పాటు చేసుకున్నాడు. ఐదేళ్లుగా మిద్దెతోటతో అనుబంధాన్ని పెంచుకున్నానని, ఇప్పుడు ఫలసాయం పొందుతున్నానని యుగంధర్ అంటున్నారు.

మూడంతస్థుల్లో.. ఖాళీ స్థలంలో..

జనగాని యుగంధర్ కరీంనగర్ టెలిఫోన్‌క్వార్టర్స్ ప్రాంతంలోని తన ఇంటి మూడంతస్థుల్లోని ఖాళీ ప్రదేశాలు, టెర్రస్‌పై మిద్దెతోటను నిర్వహిస్తున్నాడు. యుగంధర్, ఆయన భార్య రేణుక ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులైనప్పటికీ మిద్దతోటపై ఉన్న ఆసక్తితో బీర, కాకర, చిక్కుడు, టమాట వంటి 20 రకాల కూరగాయలు, 20 రకాల పండ్ల మొక్కలతోపాటు కంద గడ్డ వంటి దుంపలు, మిరియాలు, యాలకుల లాంటి సుగంధ ద్రవ్యాల మొక్కలు పెంచుతున్నారు. ఏడు రకాల ఆకుకూరలు, 13 రకాల ఔషధ మొక్కలను పెంచుతున్నాడు. మొదట 186 గజాల విస్తీర్ణంలో గ్రౌండ్ ఫ్లోర్‌లోనే చిన్నగా టెర్రస్ గార్డెన్‌ను ప్రారంభించాడు. చుట్టూ ఇళ్లు, అపార్ట్‌మెంట్లు నిర్మాణాలతో మొక్కలపై ఎండ పడకపోవడంతో సరిగా ఎదగలేదు. దీంతో రెండు అంతస్థుల్లో ఖాళీ ప్రదేశాలు బాల్కనీ, ఇతర చోట్ల మొక్కలు పెంచాడు. మూడో అంతస్థు టెర్రస్ మొత్తం కూరగాయలు, పూలు, ఔషధ మొక్కలు పెంచుతున్నాడు.వారింటికి సరిపడే కూరగాయలు మిద్దెతోటలోనే లభ్యమవుతున్నాయి. సీజన్‌లో కూరగాయలు ఎక్కువగా పండుతుండడంతో కాలనీవాసులకు పంపిణీ చేస్తున్నాడు.


ఔషధ మొక్కలు

ఇంటిపైన 20 రకాల కూరగాయలు

ముత్తారం: మిద్దెతోటలో భాగంగా సంప్రదాయ పద్ధతిలో ఇంటి పైనే సుమారు 20 రకాలకు పైగా కూరగాయలను సాగు చేస్తున్నారు ఓ మహిళ. పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల కేంద్రానికి చెందిన గడ్డం శ్రీలతశ్రీధర్ మూడేళ్లుగా మిద్దెతోటలో చేపడుతున్న సాగు వివరాలు, విశేషాలు..

కూరగాయలు కావాలంటే మార్కెట్‌కు వెళ్తాం.. ఎక్కడ పండించారో, ఏయే ఎరువులు వాడారో తెలియకుండానే కొంటాం... వాటిలో వాడిపోయినవి, పుచ్చిపోయినవి ఉంటే ఎంతో అసహనానికి గురవుతాము. దీంతో గడ్డం శ్రీలతశ్రీధర్‌కు తానే ఆకు కూరలు, కూరగాయలు పండించాలనే ఆలోచన వచ్చింది. మిద్దెపై మొక్కల పెంపకం ప్రారంభించారు. కుటుంబ సంరక్షణ చూసుకుంటూనే సేంద్రియ వ్యవసాయంపై ఉన్న మక్కువతో మిద్దె తోట సాగుపై ఆసక్తి పెంచుకున్నారు. ఇంట్లో ఉండే పాత డబ్బాలు, ప్లాస్టిక్ బకెట్లు, థర్మకోల్ డబ్బాలనే కుండీలు ఉపయోగిస్తూ మొక్కలు పెంచుతున్నారు. ఎలాంటి రసాయనిక ఎరువులు వాడకుండా తమ ఇంటిపై ఆకుకూరలు, కూరగాయలు పండిస్తున్నారు. ఏ రోజు కారోజు ఇంటిల్లిపాది తినాలనుకున్న కూరగాయలు, ఆకుకూరలను ఆ తోట నుంచే సేకరిస్తున్నారు.

మన ఆరోగ్యం మన చేతుల్లోనే..

సాధారణ గృహిణి అయిన గడ్డం శ్రీలతశ్రీధర్ మూడేళ్ల క్రితం సేంద్రియ పద్ధతిపై అవగాహన పెంచుకుని మిద్దె తోట ప్రారంభించారు. తమకున్న వెయ్యి చదరపు అడుగుల మిద్దెపై 700 చదరపు అడుగుల స్థలంలో మొదట ఆకు కూరల సాగు చేశారు. తర్వాత కూరగాయల సాగు ప్రారంభించారు. ఇప్పుడు ఇంట్లో పూర్తిగా ఆర్గానిక్ కూరగాయలనే వాడుతున్నారు. మిద్దె తోటలు పెంచడానికి పెద్దగా ఖర్చు కావడం లేదని, ఏడాదిలో నాలుగు నెలలు మినహా 8 నెలలు ఇంట్లో పండిన కూరగాయలనే వినియోగిస్తామని శ్రీలత తెలిపారు. దీంతో నెలకు సుమారు 4 వేల వరకు కూరగాయలు కొనకుండా ఆదా చేయవచ్చని చెబుతున్నారు.


మిద్దె తోటలో పండిన కూరగాయలను చూపిస్తున్న శ్రీలత

చిన్నప్పటి నుంచి వ్యవసాయంపై మక్కువ

జనగాం యుగంధర్, కరీంనగర్


మొక్కలకు నీరు పడుతున్న యుగంధర్

మాది కమలాపూర్ మండలం కనపర్తి. చిన్నప్పటి నుంచి వ్యవసాయం, గీత వృత్తి చేసేవాడిని. 1995లో ఉద్యోగం రావడంతో హైదరాబాద్ వెళ్లాను. 2014లో కరీంనగర్‌కు వచ్చిన తరువాత ఇంటి ఆవరణలోనే మొక్కలను పెంచాను. తరువాత ఇంటిపై మిద్దెతోటను ప్రారంభించాను. కరోనా సమయంలో మేము పండించిన తోట ఎంతో ఉపయోగపడింది. మాకు అవసరమైన కూరగాయలు, పండ్లు మిద్దె తోట ద్వారానే సమకూరాయి. సేంద్రియ పద్ధతిలోనే అన్ని మొక్కలు పెంచుతున్నాను. మిద్దెతోటలోని చెత్త, మొక్కల ఆకులతో డ్రై కంపోస్టును తయారు చేసి ఎరువుగా వాడుతున్నాను. కిచెన్ వేస్టేజ్‌తో వెట్ కంపోస్టు తయారు చేసి చీడపీడలను నివారించేందుకు, మొక్కల పెరుగుదలకు వాడుతు న్నాను. గులకరాళ్లు లేని ఎర్ర మట్టిలో విత్తనాలను నాటాలి. మంచిరకాల విత్తనా లు ఎంచుకోవాలి. మిద్దెతోట ఏర్పాటుకు 70 వేల వరకు ఖర్చయింది. ప్రస్తుతం నెలకు మూడు వేల ఆదాయం వస్తున్నది.

క్రైం కార్నర్

కట్టుకున్నోడే కడతేర్చాడు

- భార్యను హతమార్చిన నిందితుడి రిమాండ్

ఎల్లారెడ్డిపేట , అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కట్టుకున్న భర్తే అతి కిరాతకంగా గొంతు నులిమి కడతేర్చాడు. ఈ ఘటనలో నిందితుడిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. మండల కేంద్రంలోని సర్కిల్ కార్యాలయంలో సోమవారం రూరల్ సీఐ శ్రీనివాస్‌గౌడ్ వివరాలు వెల్లడించారు. వీర్నపల్లి మండలం జవహర్‌నాయక్‌తండాలోని భార్యాభర్తలు గుగులోత్ సుశీల(42)- రవి మధ్య కొంత కాలంగా గొడవలు చోటు చేసుకుంటున్నాయి. ఈ క్రమంలో సుశీల తన పిల్లలతో కలిసి లాల్‌సింగ్‌తండాలోని పుట్టింటికి వెళ్లింది. దసరా పండుగ సందర్భంగా అత్తిగారింటికి వెళ్లాలని పెద్దలు సుశీలకు సూచించారు. దీంతో ఆమె ఈ నెల 12న జవహర్‌నాయక్‌తండాకు చేరుకుంది. ఇంట్లో భార్యాభర్తలు మాత్రమే ఉన్నారు. అదే రోజు మద్యం తాగి ఇంటికి చేరుకున్న రవి భార్యతో గొడవ పడ్డాడు. తనను అనుమానించడం, సహకరించడం లేదనే అక్కసుతో అదే రోజు రాత్రి భార్యను తాడుతో గొంతు నులిమి చంపేశాడు. ఆమె ఆత్మహత్య చేసుకుందని నమ్మించేందుకు మృతదేహాన్ని ఇంటి బయటకు తీసుకొచ్చి పందిరికి వేలాడదీసేందుకు ప్రయత్నించాడు. ఫలించకపోవడంతో శవాన్ని ఇంటి ముందు ఉన్న మంచంపై వదిలి పారిపోయాడు. సమాచారం అందుకున్న డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎస్సై ఎల్లాగౌడ్ ఈ నెల 13న ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు పారిపోయిన నిందితుడు రవి కోసం రెండు బృందాలుగా అటవీ ప్రాంతంలో గాలించారు. నిందితుడు రవి గుట్ట ప్రాంతంలో ఉన్నాడనే సమాచారంతో కానిస్టేబుల్ మల్లాగౌడ్ అక్కడకు చేరుకున్నారు. రంగంపేట బస్టాండు ప్రాంతంలో నిందితుడు రవిని అదుపులోకి తీసుకున్నారు. ఉరి వేయడానికి వినియోగించిన తాడును స్వాధీనపర్చుకున్నారు. విచారించడగా తన భార్యను గొంతు నులిమి చంపానని రవి అంగీకరించాడని, అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ శ్రీనివాస్‌గౌడ్ వివరించారు. నిందితుడిని పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన కానిస్టేబుల్ మల్లాగౌడ్‌కు ఎస్పీ అఖిల్‌మహాజన్ రివార్డును అందజేశారని పేర్కొన్నారు.

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య


ఆంజనేయులు

మానకొండూర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్ గ్రామానికి చెందిన ఎనగందుల ఆంజనేయులు (39) అనే వ్యక్తి అప్పుల బాధ భరించలేక ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డట్లు సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మానకొండూర్‌కు చెందిన ఎనగందుల సౌజన్య-ఆంజనేయులు కుమారుడు అశ్వంత్, కుమార్తె అశ్విత ఉన్నారు. రెండేళ్ల క్రితం మానకొండూర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్య సౌజన్య, కుమారుడు అశ్వంత్ మృతి చెందారు. మృతురాలి సోదరి సంధ్యను రెండో వివాహం చేసుకొని కూలీ పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. గతంలో చేసిన అప్పుల బాధతో పాటు భార్య, కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారనే మనస్థాపంతో పెరకబండలోని సశ్మాన వాటికలో మొదటి భార్య, కుమారుల సమాధుల వద్ద సోమవారం చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తల్లిదండ్రులు, సోదరుడు మృతి చెందడంతో కుమార్తె అశ్విత అనాథగా మారిందని కాలనీవాసులు విలపించారు. రెండో భార్య సంధ్య ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ప్రాణాలు తీసిన అతివేగం

- ద్విచక్రవాహనం చెట్టు ఢీకొని ఇద్దరు యువకుల మృతి


విక్కుర్తి దిలీప్ , సురా అనిల్ (ఫైల్)

వేములవాడ రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): అతి వేగం ఇద్దరు యువకుల ప్రాణాలను బలిగొంది. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండలం హన్మాజిపేటకు చెందిన విక్కుర్తి దిలీప్ (22), సురా అనీల్ (21) ఇద్దరు స్నేహితులు. ఆదివారం రాత్రి గ్రామంలో నిర్వహించిన దుర్గామాత నిమజ్జన వేడుకలకు హాజరయ్యారు. అనంతరం నూతనంగా కొనుగోలు చేసిన బైక్‌పై ఇద్దరు సరదాగా మామిడిపల్లి రహదారి వైపు వెళ్లారు. బైక్ అతివేగంగా ఉండడంతో అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీ కొట్టింది. దీంతో ఇద్దరూ తీవ్రగాయాలపాలయ్యారు. అటువైపుగా వెళ్తున్న పెట్రోలింగ్ పోలీసులు వారిని అదే వాహనంలో ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమించిందనడంతో మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌కు తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. చేతికి అందివచ్చిన కొడుకులు మృతి చెందడంతో పండగ పూట రెండు కుటుంబాల్లో విషాదం అలుముకుంది.

దాడి చేసిన నలుగురిపై కేసు

జమ్మికుంట రూరల్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మండలం వావిలాల గ్రామ పంచాయతీ పరిధిలోని గోపాలపురం గ్రామంలో నలుగురు వ్యక్తులు మద్యం సేవించి ఇంటి మీదకు వచ్చి తలుపులు ధ్వంసం చేసి, అడ్డు వచ్చిన తన భర్తను కింద పడేసి గాయపరిచారని ఐలాపురం మౌనిక సోమవారం పోలీస్‌లకు ఫిర్యాదు చేసింది. తమ మరిది హరీష్ గ్రామానికి చెందిన ఉడుత గట్టయ్యతో గొడువ పెట్టుకున్నాడని, ఆ విషయాన్ని మనుసులో పెట్టుకున్న గట్టయ్య అతడి కుమారుడు కిరణ్, బంధువులు హరీష్, ప్రశాంత్‌లను వెంట పెట్టుకుని తమ ఇంటి మీదకు వచ్చాడని, తులపులు తీయకుంటే తన్నారని, అడ్డు వచ్చిన తన భర్త మహేష్‌ను కింద పడేసి కొట్టారని బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వరంగంటి రవికుమార్ తెలిపారు.

హుజూరాబాద్ ఆస్పత్రిలో అందుబాటులోని లేని మత్తు వైద్యుడు

- ప్రసవం కోసం గర్భిణుల పడిగాపులు
- 'ఏబీఎన్ ఆంధ్రజ్యోతి' కథనంతో కదిలిన వైద్యులు

హుజూరాబాద్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రిలో మత్తు వైద్యుడు సమయానికి రాకపోవడంతో సోమవారం ప్రసవం కోసం వచ్చిన గర్భిణిలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దసరాకు ముందు ఆరుగురు గర్భిణులు పరీక్షల కోసం ఏరియా ఆస్పత్రికి రాగా, పరీక్షించిన గైనాకాలజిస్టు సోమవారం సాయంత్రం ఆరు గంటలకు రమ్మని చెప్పారు. సోమవారం మధ్యాహ్నం ఒంటిగంటకే గర్భిణిలు ఆస్పత్రికి చేరుకున్నారు. వైద్యురాలు నార్మల్ డెలివరీ కోసం వీరిని ఆస్పత్రిలో చేర్పించుకున్నారు. గర్భిణులకు నొప్పులు ఎక్కువ కావడంతో ఆపరేషన్ చేయాలని వైద్యురాలిని కుటుంబ సభ్యులు అడిగారు. దీనికి సదరు వైద్యురాలు మత్తు డాక్టర్ జమ్మికుంట ప్రభుత్వాస్పత్రిలో శస్త్ర చికిత్స కోసం వెళ్లాడని, అతను వచ్చిన తర్వాత చేస్తానని చెప్పారు. గర్భిణులకు నొప్పులు ఎక్కువ కావడంతో ఆపరేషన్ చేయాలని కుటుంబ సభ్యులు వైద్యురాలిని అడిగారు. దీనికి సదరు వైద్యురాలు మత్తు డాక్టర్ జమ్మికుంట ప్రభుత్వాస్పత్రిలో శస్త్ర చికిత్స కోసం వెళ్లాడని, అతను వచ్చిన తర్వాత ఆపరేషన్ చేస్తామని తెలిపారు. ఈ విషయం ఏబీఎన్ ఆంధ్రజ్యోతిలో ప్రసారం కావడంతో స్పందించిన జిల్లా వైద్య శాఖాధికారులు హుటాహుటిన మత్తు డాక్టర్‌ను పిలిపించి సాయంత్రం గర్భిణులకు ఆపరేషన్ నిర్వహించారు. దీనిపై ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజేందర్‌రెడ్డిని వివరణ కోరగా గర్భిణిలను సాయంత్రం ఆరు గంటలకు రమ్మంటే ముందుగా వచ్చారన్నారు. నార్మల్ డెలివరీ కోసం వైద్యురాలు ప్రయత్నించారన్నారు. హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రిలో నలుగురు మత్తు వైద్యులు ఉండగా వారిలో ముగ్గురు బదిలీపై వెళ్లారని, వారి స్థానంలో ఎవరూ రాలేదని తెలిపారు. ప్రస్తుతం ఉన్న ఒక్క డాక్టర్ జమ్మికుంట, హుజూరాబాద్ ఆస్పత్రుల్లో సేవలందిస్తున్నాడని చెప్పారు.

- వైద్యుల కొరత



హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రిలో 23మంది వైద్యులు ఉండగా, మత్తు డాక్టర్లు ముగ్గురు బదిలీల్లో భాగంగా మూడు నెలల క్రితం ఇతర ప్రాంతాలకు వెళ్లారు. వారి స్థానంలో ఎవరినీ నియమించలేదు. ఒకరు మాత్రమే మత్తు డాక్టర్ ఉండగా, హుజూరాబాద్, జమ్మికుంట ప్రభుత్వాస్పత్రులను చూసుకుంటున్నారు. ఏరియా ఆస్పత్రిలో నలుగురు గైనాకాలజిస్టుకు బదులుగా ముగ్గురు మాత్రమే ఉన్నారు. బదిలీపై వెళ్లిన వారి స్థానంలో ఎవరినీ నియమించలేదు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

అప్పన్నపేటలో 'పుష్ప' విలన్

మలయాళ హీరో ఫాహద్ ఫాజిల్ పోలికలతో గుర్తింపు పొందుతున్న జానపద కళాకారుడు

ఇన్‌స్టా రీల్స్‌తో వెలుగులోకి వస్తున్న ప్రతిభ


ఉడిపిలో జరిగిన ఈవెంట్‌లో ఫాహద్‌ఫాజిల్ వేషధారణలో అడప మహేష్ (ఫైల్)

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా అప్పన్నపేటకు వెళితే అక్కడ మీకు పుష్ప సినిమా విలన్, మలయాళ హీరో ఫాహద్ ఫాజిల్ కనిపిస్తాడు. అంతటి హీరో ఇక్కడున్నాడేంటా అని పరిశీలించి చూస్తే ఆయన పాహద్ ఫాజిల్ కాదు.. అప్పన్నపేటకు చెందిన అడప మహేష్ అని గుర్తిస్తారు. మహేష్ ఓ జానపద కళాకారుడు. డ్రైవర్‌గా పని చేస్తూ ఖాళీ సమయాల్లో జానపద వీడియో ఆల్బమ్‌లు, షార్ట్ ఫిలిమ్స్‌లో నటిస్తున్నాడు. మహేష్ మలయాళ హీరో ఫాహద్ ఫాజిల్ పోలికలతో ఉంటాడు. పుష్ప సినిమా తర్వాత అందరూ 'మహేష్‌ను పార్టీ లేదా పుష్ప' అంటూ ఆటపట్టించడం ప్రారంభించారు. దీంతో దానిని తనకు అనుకూలంగా మార్చుకున్న మహేష్ ఇన్‌స్టా గ్రాంలో రీల్స్ చేయడం ప్రారంభించాడు. ఈ రీల్స్ చూసిన కన్నడ చిత్రసీమకు చెందిన అసిస్టెంట్ డైరెక్టర్ ఒకరు మహేషకు సినిమాల్లో అవకాశం ఇస్తానని మాట ఇచ్చాడు. కర్ణాటక రాష్ట్రంలోని ఉడిపి పట్టణంలో జరిగే ఓ ఈవెంట్‌కు మహేష్‌ను ఆహ్వానించాడు. అక్కడ మహేష్ ఆవేశం సినిమాలో ఫాహద్ ఫాజిల్ వేసిన గెటప్ లో అందరినీ అలరించాడు. అక్కడికి వచ్చిన వారందరూ ఫాహద్ ఫాజిలే వచ్చాడా.. అని ఆశ్చర్యపోయారు.

మంచినీటి సహాయకులొస్తున్నారు

- రక్షిత తాగునీటి సరఫరా కోసం శిక్షణ.. ● పరిష్కారం కానున్న నీటి సమస్యలు

హుజూరాబాద్‌రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పలు గ్రామాల్లో మిషన్ భగీరథ పైపులైన్లు పగిలి నీరు కలుషితమై ప్రజారోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయి. తాగు నీరు పెద్ద మొత్తంలో వృథా అవుతోంది. ఈ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఓ ఆలోచన చేసింది. ప్రతి గ్రామానికి మంచినీటి సహాయకుడిని నియమించాలని నిర్ణయించింది. చిన్న పంచాయతీలకు ఒక కార్మికుడిని, మేజర్ గ్రామపంచాయతలకు ఇద్దరిని ఎంపిక చసి నల్ జల్ మిత్ర పథకంలో భాగంగా శిక్షణ ఇచ్చింది.

- మంచినీటి సహాయకుల బాధ్యతలు

మంచినీటి సహాయకులు గ్రామాల్లో చేతిపంపులు, విద్యుత్ మోటార్లకు సంబంధించిన చిన్న చిన్న మరమ్మతులు చేయాలి. ఎక్కడైనా లీకేజీలు ఉంటే అరికట్టాలి. నిత్యం నీటి నాణ్యతను పరిశీలించాలి. ఈ అంశాల్లో వారికి శిక్షణ ఇచ్చారు. నెలలో మూడుసార్లు నీటి ట్యాంకులను(1వ, 10వ, 21వ తేదీ) కడగాలి. నిత్యం క్లోరిన్ పరీక్షలు చేయాలి. ట్యాంకుకు ఎక్కించిన నీటిలో క్లోరిన్ 2 పీపీఎం ఉండాలి. తక్కువ ఉంటే బక్కెట్ నీటిలో 40 గ్రాముల బ్లీచింగ్ కలిపి 15 నిమిషాల తర్వాత నీటి ట్యాంకుల్లో పోయాలి. అరగంట తరువాత నీటిని విడుదల చేయాలి. ట్యాంకు దగ్గరి మొదటి ఇంటి వద్ద ఇచ్చిన క్లోరోస్కాప్ ద్వారా నీటి నాణ్యత పరీక్షించాల్సి ఉంటుంది. గతంలో తాగునీటి పైప్‌లైన్లకు లీకేజీలు ఏర్పడినా, మరమ్మతుల కోసం సంబంధిత మెకానిక్‌లు వచ్చే వరకు ఆగాల్సి వచ్చేది. కొన్ని సందర్భాల్లో నెలల తరబడి మరమ్మతులకు నోచుకోకుండా నీరు వృథాగా పోయేది. ప్రస్తుతం ప్రతి గ్రామానికి సహాయకుడు ఉండడంతో సమస్యను పరిష్కారించే అవకాశం ఉంటుంది. సమస్య తీవ్రంగా ఉంటే అధికారుల దృష్టికి తీసుకెళతారు.


ఎంపీడీవో కార్యాలయంలో శిక్షణ ఇస్తున్న అధికారులు (ఫైల్)



గ్రామ స్థాయిలోనే తాగునీటి సమస్య పరిష్కారం
-తూర్పాటి సునీత, ఎంపీడీవో, హుజూరాబాద్

మంచినీటి సహాయకులతో గ్రామ స్థాయిలోనే తాగునీటి సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. ఇప్పటికే సహాయకులను ఎంపిక చేసి శిక్షణ ఇచ్చాం. ప్రజలకు సురక్షిత తాగునీరు సరఫరా చేయాలన్నదే ప్రభుత్వ ధ్యేయం.

దాడి చేసిన నలుగురిపై కేసు

జమ్మికుంట రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మండలం వావిలాల గ్రామ పంచాయతీ పరిధిలోని గోపాలపురం గ్రామంలో నలుగురు వ్యక్తులు మద్యం సేవించి ఇంటి మీదకు వచ్చి తలుపులు ధ్వంసం చేసి, అడ్డు వచ్చిన తన భర్తను కింద పడేసి గాయపరిచారని ఐలాపురం మౌనిక సోమవారం పోలీస్‌లకు ఫిర్యాదు చేసింది. తమ మరిది హరీష్ గ్రామానికి చెందిన ఉడుత గట్టయ్యతో గొడువ పెట్టుకున్నాడని, ఆ విషయాన్ని మనుసులో పెట్టుకున్న గట్టయ్య అతడి కుమారుడు కిరణ్, బంధువులు హరీష్, ప్రశాంత్‌లను వెంట పెట్టుకుని తమ ఇంటి మీదకు వచ్చాడని, తులపులు తీయకుంటే తన్నారని, అడ్డు వచ్చిన తన భర్త మహేష్‌ను కింద పడేసి కొట్టారని బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వరంగంటి రవికుమార్ తెలిపారు.

బీరు సీసతో దాడి.. కేసు నమోదు

జమ్మికుంట రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మండలం వావిలాల గ్రామానికి చెందిన ఐలాపురం హరీష్ అప్పుగా తీసుకున్న డబ్బులు తిరిగి చెల్లిస్తానని ఇంటికి పిలిచి బీరు సీసాతో గాయపరిచాడని బాధితుడు ఉడుత గట్టయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వరంగంటి రవికుమార్ తెలిపారు.

వ్యవసాయ విద్యుత్ మోటార్లు మాయం

శంకరపట్నం, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): మండలంలోని అర్కండ్ల వాగులో నుంచి పంట పొలాలకు నీరు అందించేందుకు రైతులు విద్యుత్ మోటర్లను అమర్చుకున్నారు. ఇద్దరు రైతులకు చెందిన విద్యుత్ మోటర్లను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. బాధిత రైతులు నేదురు భూమయ్య, చిలువేరి చంద్రయ్య, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం రాత్రి 10గంటల వరకు వ్యవసాయ బావి వద్ద పనులు ము గించుకొని తిరిగి వెళ్లారు. సోమవారం ఉదయం 6గంటలకు పొలం వద్దకు వెళ్లేసరికి తన మోటార్లను ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించారని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని బాలుడికి గాయాలు

తిమ్మాపూర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని అలుగునూర్‌లో ఆర్టీసీ బస్సు ఢీకొన్న సంఘటనలో ఓ బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బాన్సువాడ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వరంగల్ వైపు నుంచి నిజామాబాద్ వెళుతుండగా అలుగునూర్ వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి రోడ్డు పక్కన నడుచుకుంటూ వెలుతున్న కన్నం వినయ్(15) అనే బాలుడికి ఢీకొంది. ఈ ప్రమాదంలో వినయ్‌కు తీవ్రగాయాలు కాగా స్థానికులు బాలుడిని అసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎల్ఎండీ పోలీసులు కేసును దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

పెగడపల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పెగడపల్లి మండలంలోని మ్యాకవెంకయ్యపల్లి గ్రామ శివారులో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులిద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రామడుగు మండలం గోపాల్‌రావు పేట గ్రామానికి చెందిన అలువాల విష్ణు అతడి భార్య రమ్యతో కలిసి ఆదివారం రాత్రి ఏపీ9 ఏజడ్ 5832 నెంబరు గల బైక్‌పై గోపాల్‌రావు పేట నుంచి పెగడపల్లికి వస్తుండగా మ్యాకవెంకయ్యపల్లి సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి ఏపి 25 క్యూ 8256 నెంబరు గల వాహనంతో అతి వేగంగా నడుపుకుంటూ వచ్చి ఢీకొట్టాడు. దీంతో విష్ణు రమ్యలు కిందపడగా తీవ్ర గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఆస్పత్రికి తరలించారు. రమ్య పరిస్థితి విషమంగా ఉందని, విష్ణుకు తీవ్ర గాయాలయ్యాయని విష్ణు తండ్రి అంజయ్య ఫిర్యాదు మేరకు సోమవారం కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవికిరణ్ తెలిపారు.

న్యూస్ బాక్స్

'ఖని'లో భారీ వర్షం

కళ్యాణ్‌నగర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో సోమవారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులు, పిడుగులతో సుమారు రెండు గంటల పాటు భారీగా వర్షం కురిసింది. దీంతో పట్టణంలో రోడ్లన్నీ జలమయమయ్యాయి.

రామగుండం ఐఎంఏ అధ్యక్షుడిగా క్యాస శ్రీనివాస్



కళ్యాణ్‌నగర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రామగుండం ఐఎంఏ అధ్యక్షుడిగా డాక్టర్ క్యాస శ్రీనివాస్‌ను సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ లక్ష్మీవాణి, కోశాధికారిగా డాక్టర్ నాగిరెడ్డిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా క్యాస శ్రీనివాస్ మాట్లాడుతూ ఐఎంఏలో సమూల మార్పులను తీసుకురానున్నట్టు తెలిపారు. రామగుండంలో వైద్యుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని చెప్పారు. అధ్యక్షుడిగా ఎన్నికైన క్యాస శ్రీనివాస్‌ను ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, మేయర్ బంగి అనిల్‌కుమార్ తదితరులు అభినందించారు.

లక్కీడ్రా విజేతలకు బహుమతుల ప్రదానం

పెద్దపల్లి రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాగినేడు గ్రామపంచాయతీలో దుర్గామాతను ప్రతిష్ఠించగా లక్కీ డ్రాను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దుర్గామాత శోభాయాత్ర నిర్వహించి నిమజ్జనం అనంతరం లక్కీ డ్రా తీసి ఆరుగురు విజేతలకు బహుమతులను మండప నిర్వాహకులు సోమవారం ప్రదానం చేశారు. మొదటి బహుమతి ఎల్‌ఈడీ టీవీ విజేతగా ఏనుగంటి ప్రతాప్‌కు దక్కింది. రెండో బహుమతి టేబుల్ ఫ్యాన్ దాడి నవీన్, మూడో బహుమతి (సీలింగ్ ఫ్యాన్) రంగు సంపత్, నాలుగో బహుమతి (రైస్ కుక్కర్) సాయిచరణ్, ఐదో బహుమతి (గ్యాస్ స్టవ్) బూస నారాయణ, ఆరో బహుమతి (స్మార్ట్ వాచ్) ముత్యం అవిక్షిత్ గౌడ్‌కు దక్కింది. కార్యక్రమంలో మండప నిర్వాహకులు పాల్గొన్నారు.

ప్రయాణం నరకప్రాయం

- అధ్వానంగా గ్రామీణ రోడ్లు
- తరుచూ ప్రమాదాలు
- రోడ్ల మరమ్మతు చేయాలని కోరుతున్న ప్రజలు

సుల్తానాబాద్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ ప్రాంతంలోని గ్రామీణ ప్రాంత రోడ్లు నరక ప్రాయంగా మారాయి. ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోకపోవడంతో రోడ్లపై ప్రయాణం చేయాలంటే ప్రజలు భయపడుతున్నారు. నడిరోడ్డుపై గుంతలు పడినా, కోతకు గురైన వాటిని బాగుచేయించడం లేదు. దాంతో రాత్రివేళల్లో వీటిని గమనించని వాహనదారులు ప్రమాదాల బారినపడి గాయాలపాలవుతున్నారు. కొన్ని గ్రామాల్లో రోడ్లు బాగలేక ప్రతీ వర్షాకాలంలో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని పలు గ్రామాల్లోని రోడ్ల నిర్మాణానికి యత్నాలు జరిగాయి. కానీ అంతలోనే ఎన్నికలు రావడంతో పనులు ఆగిపోయాయి. ప్రస్తుతం వాటి గురించి ఎవరూ పట్టించుకోవడం లేదని ప్రజలు అవేదన వ్యక్తం చేస్తున్నారు. సుల్తానాబాద్ మండలంలోని రామునిపల్లి గ్రామం నుంచి రేగడిమద్దికుంట (అల్లీపూర్) వరకు ఉన్న రోడ్డు గుంతలమయంగా మారింది. రోడ్డు కోతకు గురైంది. అసలే రోడ్డు ఇరుకు ఉన్న ప్రాంతంలో సగం వరకు కోతకు గురికావడంతో రాత్రి వేళల్లో కానీ మామూలు సమయాల్లో కానీ వాహనదారులు గుర్తించకుండా అందులో పడిపోతున్నారు. రామునిపల్లి రోడ్డుపై రెండు పెద్దపెద్ద గొయ్యిలు ఏర్పడి ఏళ్లు గడిచిపోతున్నాయి. కానీ వాటిని



కోతకు గురైన రామునిపల్లి-మద్దికుంట రోడ్డు



అల్లీపూర్ రోడ్డు మధ్యలో ఏర్పడిన గొయ్యి

పట్టించుకున్న నాథుడే లేడు. మద్దికుంట మీదుగా, రామునిపల్లి గ్రామాల మీదుగా రాకపోకలు సాగించే వాహనదారులు గొయ్యిలు, గుంతలమూలంగా ప్రమాదాల బారినపడుతున్నారు. మియాపూర్ నుంచి పెద్దబొంకూర్ వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. ఈ రోడ్డు నిర్మాణానికి గత ప్రభుత్వ హయాంలో నిధులు కూడా మంజూరు అయినా పనులు మాత్రం ప్రారంభం కాలేదు. ప్రతీ సీజన్‌లో నిత్యం వందలాది మంది రైతులు రాకపోకలు సాగిస్తుంటారు. వారు అనేక అవస్థలు పడుతున్నారు. సుద్దాల నుంచి చిన్నబొంకూర్ గ్రామానికి వెళ్లే రోడ్డుపై తారు లేచిపోయింది. ఎక్కడ చూసినా కంకర మట్టి కనబడుతోంది. రోడ్డును వెంటనే బాగు చేయాలని లేదా కొత్త రోడ్డు నిర్మాణం చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరతున్నారు.

అలాగే పెరుకపల్లి నుంచి ఇతర మండలాలకు వెళ్లే రోడ్డు కూడా అధ్వానంగా ఉంది. ప్రజలు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కొత్తగా నిర్మించిన సుల్తానాబాద్-సుద్దాల- రేగడిమద్దికుంట రోడ్డులో అనేక మూల మలుపులు ఉండడంతో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. ఈ మూల మలుపుల్లో ఏర్పడకుండా వ్యవసాయ బావులు కూడా ఉండడంతో బావులు ప్రమాదాలకు నిలయంగా మారాయి. ముఖ్యంగా గర్రెపల్లి నుంచి బొంతకుంటపల్లి, రంగంపల్లి, నీరుకుళ్ల, గటేపల్లి, కదంబాపూర్, కనుకుల-రేగడిమద్దికుంట చౌరస్తా వరకు ఉన్న రోడ్డు కూడా పూర్తి అధ్వానంగా తయారైంది. రోడ్డు గుండా అనేక ఇసుక లారీలు ట్రాక్టర్లు, గ్రానైట్ లారీలు సైతం రాకపోకలు సాగిస్తున్నాయి. దాంతో రోడ్డు పూర్తిగా పాడైపోయింది. సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి రాజీవ్ రహదారి నుంచి కోమండ్లపల్లి నీరుకుళ్ల రోడ్డు కూడా గతుకులమయంగా మారింది. మండలంలోని అనేక గ్రామాల్లోని రోడ్లు పాడైపోయి ప్రయాణాలను నరకప్రాయం చేస్తున్నాయి. కొత్త రోడ్ల నిర్మాణాలు చేపట్టాలని, కొన్ని రోడ్లకు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

భూవివాదంలో దాడికి యత్నించిన ఒకరి అరెస్టు

మంచిర్యాల అర్బన్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): భూవివాదంలో దాడికి యత్నించిన కుంట శ్రీనివాస్ అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఏసీపీ ఆర్ ప్రకాష్ తెలిపారు. సోమవారం ఆయన కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌కు చెందిన పోతిరెడ్డి సుధాకర్ రెడ్డి, జైపూర్ మండలం రసూల్‌పల్లికి చెందిన కోమటి సత్తయ్య, పట్టణంలోని హమాలీవాడకు చెందిన సోంశెట్టి సంపత్ 10 సంవత్సరాల క్రితం గర్మిళ్ల శివారులోని సర్వే నెంబరు 180/1 లో చెరో వెయ్యి గజాల చొప్పున భూమిని కొనుగోలు చేసి సిమెంట్ ప్లేట్ ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేసుకున్నారు. మంథని మండలం గుంజపడుగుకు చెందిన కుంట శ్రీనివాస్ అనే రియల్ ఎస్టేట్ వ్యాపారి గత నెల సిమెంట్ ప్లేట్లను ధ్వంసం చేశాడు. దీంతో సుధాకర్ రెడ్డి, కోమటి సత్తయ్య సోంశెట్టి సంపత్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. అయినా శ్రీనివాస్ తన పద్ధతి



వివరాలు వెల్లడిస్తున్న మంచిర్యాల ఏసీపీ ప్రకాష్

మార్చుకోకపోగా వారం క్రితం ఆ భూమిని కొలిచి ఆక్రమించేందుకు ప్రయత్నం చేశాడు. ముగ్గురిలో సుధాకర్ రెడ్డి అడ్డు తొలగించుకుంటే భూమిని కబ్జా చేయవచ్చని శ్రీనివాస్ నిర్ణయించుకున్నాడు. ఈ నెల 10న సాయంత్రం సుధాకర్ రెడ్డి అతని పార్ట్‌నర్స్ భూమి వద్దకు వచ్చాడని తెలుసుకున్న శ్రీనివాస్ తల్వార్‌ను తీసుకొని అక్కడికి వచ్చి సుధాకర్ రెడ్డిని హత్య చేసేందుకు ప్రయత్నించగా వారు పారిపోయారు. సోమవారం అమరవాది శివారులోని ఓపెన్‌కాస్టు ఏరియా వద్ద పట్టణ సీఐ, ఎస్సైలు పట్టుకొని విచారించగా 2013లో శ్రీనివాస్ ఒక ఎకరం భూమిని కొనుగోలు చేశాడని వెల్లడించాడు. భూమి విలువ పెరగడంతో తన పక్కన ఉన్న సుధాకర్ రెడ్డి, అతని పార్ట్‌నర్స్‌కు చెందిన స్థలాన్ని తన భూమి అని చెప్పి ఆక్రమించుకొని అమ్మితే ఎక్కువ లాభాలు గడించవచ్చని అనుకొని కబ్జాకు యత్నించాడు. శ్రీనివాస్ గట్టు వామన్‌రావు దంపతులను హత్యచేసిన ఘటనలో ఏ-1 నిందితుడని, అతనిపై ఇప్పటివరకు ఐదు కేసులు ఉన్నాయని ఏసీపీ తెలిపారు. కుంట శ్రీనివాస్‌ను అరెస్టు చేసి, అతని వద్ద నుంచి తల్వార్‌ను స్వాధీనం చేసుకున్నామని, రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పర్చినట్లు ఏసీపీ తెలిపారు. సమావేశంలో పట్టణ సీఐ బన్సీలాల్, ఎస్సై సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వేర్వేరు కారణాలతో ఖనిలో ఇద్దరి ఆత్మహత్య

- మద్యానికి బానిసై ఒకరు...
- కొడుకు మద్యం మానడం లేదని మరొకరు...



రాజేశ్వరి(ఫైల్)

కోల్‌సిటీ, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని పట్టణంలో సోమవారం వేర్వేరు కారణాలతో ఇద్దరు ఆత్మహత్యకు పాల్పడ్డారు. మద్యానికి బానిసై గోదావరిఖని ఎల్‌బీనగర్‌కు చెందిన శ్రీనివాస్(49) అనే వ్యక్తి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శ్రీనివాస్‌కు కుమారుడు, కూతురు ఉన్నారు. కుమారుడు ప్రైవేట్ సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తున్నా డు. కూతురు దివ్యాంగురాలు. చాలాకాలంగా మద్యానికి బానిసైన శ్రీనివాస్ సోమవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు శ్రీనివాస్ భార్య రాజేశ్వరి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

స్థానిక విఠల్‌నగర్‌లో నివాసముండే తిప్పని రాజేశ్వరి(65) సోమవారం ఇంట్లో ఆత్మహత్యకు పాల్పడింది. ఆమె భర్త మల్లయ్య సింగరేణిలో ఉద్యో గం చేసి మరణించాడు. ఇద్దరు కుమారులు పెద్దకుమారుడు కుమార్, చిన్న కుమారుడు శ్రీనివాస్ ఉన్నారు. ఇద్దరు సింగరేణి ఉద్యోగులే. భర్త వారసత్వ ఉద్యోగం పెద్ద కుమారుడు కుమార్‌కు పెట్టించగా నాలుగేళ్ల క్రితం వివాహం చేశారు. మద్యానికి బానిసై న అతడు సరిగా డ్యూటీలకు వెళ్లకపోవడంతో భార్య వదిలిపెట్టి పోయింది. అప్పటి నుంచి విఠల్‌నగర్‌లోని తల్లి వద్దనే ఉంటున్నాడు. మద్యం మానాలని, డ్యూటీలు చేయాలని నిత్యం బ్రతిమిలాడేది. సోమవారం డ్యూటీకి వెళ్లమని పంపించింది. కుమార్ డ్యూటీకి వెళ్లకుండా మళ్లీ మద్యం తాగి వచ్చి పడుకోవ డంతో వంట గదిలోకి వెళ్లి రాజేశ్వరి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలు రాజేశ్వరి చిన్న కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

అక్కెపల్లిలో వ్యక్తి ఆత్మహత్య

మంథని, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని అక్కెపల్లి గ్రామంలో కొడుపు నొప్పి భరించలేక గోవిందారం ముత్తయ్య (49) అనే వ్యక్తి పురుగుల మందు తాగి సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ముత్తయ్య 10 సంవత్సరాలుగా కడుపు నొప్పితో బాధపడుతు న్నాడు. ఎన్ని ఆసుపత్రులు చూపించుకున్న తగ్గకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు ముత్తయ్య భార్య సరోజన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మద్యం దుకాణంలో చోరీ

యైటింక్లయిన్‌కాలనీ, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): కాలనీలోని శ్రీ రాజరాజేశ్వర వైన్స్‌లో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. సోమవారం ఉదయం నిర్వాహకులు వైన్స్ తెరవగా దుకాణంపై కప్పు రేకులు పగులగొట్టి ఉన్నాయి. పైకప్పు పగులగొట్టి లోపలికి దిగిన దుండగులు సుమారు 55వేలు విలువ చేసే మద్యం తో పాటు కౌంటర్‌లో ఉంచిన రూ.35 వేల నగదును అపహరించారు. చోరీ విషయమై నిర్వాహకులు గోదావరిఖని టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



రామగిరి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని లద్నాపూర్ గ్రామంలోని వందన ఉన్నత పాఠశాలలో 2007-08 బ్యాచ్‌కి చెందిన పదోతరగతి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని సెంటనరి కాలనీలోని సింగరేణి ఫంక్షన్ హాల్‌లో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు బాల్య స్మృతులను నెమరు వేసుకున్నారు. అప్పటి గురువులను ఆహ్వానించి సన్మానించారు. ఎక్కడెక్కడో ఉద్యోగా లు చేస్తూ వివిధ హోదాల్లో స్థిరపడిన వారంతా ఆనందంగా గడిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రసన్న హరికృష్ణకు మద్దతు


పెద్దపల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీ అభ్యర్థి అయిన ప్రసన్న హరికృష్ణకు మద్దతు ప్రకటిస్తున్నట్లు బీసీ యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్ టి రాజ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జనాభాలో 52 శాతానికిపైగా ఉన్న బీసీలందరూ బీసీ అభ్యర్థి అయిన హరికృష్ణకు మద్దతు ఇచ్చి భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని బీసీ సంఘాల పక్షాన కోరారు. 52 శాతానికిపైగా ఉన్న బీసీలందరం ఐక్యంగా లేకపోవడం వల్లనే రాజకీయాల్లో ముందుకు రాలేక పోతున్నామని అన్నారు. ఎన్నికల్లో బీసీలు పార్టీలకు, కులాలకు అతీతంగా ఏకమై బీసీ ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు.

దసరా ఉత్సవాల్లో ఘర్షణపై పోలీసుల సీరియస్

- ఘర్షణ పడ్డ యువకుల గుర్తింపు
- చేయిచేయి తగిలినందుకే కొట్లాట
- తల్లిదండ్రులు సమక్షంలో యువకులకు ఏసీపీ కౌన్సెలింగ్

కోల్‌సిటీ, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని సింగరేణి స్టేడియంలో దసరా ఉత్సవాలను ప్రజలు సంబురంగా జరుపుకుంటుంటే వెనుకవైపు కొందరు యువకులు ఘర్షణ పడిన ఘటనను పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. వీడియోల ఆధారంగా ఘర్షణ పడిన యువకులను గుర్తించారు. గాంధీనగర్, లెనిన్‌నగర్‌కు చెందిన యువకులను, వారి తల్లిదండ్రులను సోమవారం ఠాణాకు పిలిపించారు. వీరిలో విద్యార్థులు, చిన్నచిన్న పనులు చేసుకుంటున్న వారు ఉన్నారు. వీరు ఒకరికొకరికి పరిచయాలు కూడా లేవు. స్టేడియంలో ఇద్దరు యువకులకు ఒకరి చేయి ఒకరికి తగిలినందుకే గొడవకు దిగినట్టు పేర్కొన్నారు. ఏసీపీ మడక రమేష్ యువకులను తీవ్రంగా హెచ్చరించారు. వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. కేసులు నమోదు అయితే జీవితాలు నాశనం అవుతాయని, ఇలాంటి ఘటనలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల కదలికలు, ప్రవర్తనను కనిపెట్టాలని, వారు ఏం చేస్తున్నారు, ఎటు వెళుతున్నారనేది తెలుసుకోవాలన్నారు. తల్లిదండ్రుల కట్టడిలో పిల్లలు లేకపోతే వారు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతారన్నారు.

పిల్లల భవిష్యత్ ఒక రకంగా తల్లిదండ్రుల చేతుల్లోనే ఉందనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. కాగా స్టేడియంలో తక్కువ వయసు ఉన్న యువకులు ఘర్షణపడిన ఘటన రామగుండం ప్రాంతంలో చర్చనీయాంశం అయ్యింది. దసరా ఉత్సవాలకు ఈ ప్రాంతం నుంచి భాగా చదువుకొని స్థిరపడ్డ యువత కుటుంబాలతో హాజరైతే కొందరు మాత్రం జులాయిగా ఘర్షణకు దిగడంపై సామాజిక మాధ్యమాల్లో విమర్శలకు దారితీసింది.



సింగరేణిని ప్రగతి పథంలో నడుపుతాం

ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్

గోదావరిఖని/యైటింక్లయిన్‌కాలనీ, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణకు తలమానికమైన సింగరేణిని ప్రగతిపథంలో నడిచేలా రాష్ట్ర ప్రభుత్వం సహకారాన్ని అందిస్తుందని, సింగరేణి కార్మికులు తమ చెమటను రక్తంగా మార్చి సంస్థకు లాభాలను తీసుకువస్తున్నారని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. సోమవారం జీడీకే 11ఇంక్లైన్‌లో, ఓసీపీ-3 ప్రాజెక్టు, సీహెచ్‌పీల్లో 'సింగరేణి ఉజ్వల భవిష్యత్-ఉద్యోగుల పాత్ర' కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సింగరేణి సంస్థ బొగ్గు రంగంలోనే కాకుండా విద్యుత్, సోలార్, జల విద్యుత్ రంగంలో కూడా అడుగుపెట్టడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందన్నారు. సింగరేణి, జెన్‌కో ఆధ్వర్యంలో రామగుండంలో 800 మెగావాట్ల విద్యుత్ కేంద్రం, మేడిపల్లి ఓసీపీలో 500మెగావాట్ల జల విద్యుత్‌ను, జైపూర్‌లో 800 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్‌ను తీసుకువస్తున్నట్టు చెప్పారు. కార్మికులకు లాభాల వాటా 33శాతంతో పాటు కాంట్రాక్టు కార్మికులకు రూ.5వేల లాభాల వాటా ఇచ్చినట్టు చెప్పారు. సింగరేణి సంస్థ బీఐఎఫ్‌ఆర్‌లోకి వెళ్లినప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వమే కాపాడిందని గుర్తుచేశారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అవినీతి, లంచగొండితనం తప్ప చేసిందేమి లేదన్నారు. సింగరేణి సంస్థను మరింత అభివృద్ధి పథంలో నడిపించడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కృషి చేస్తున్నారన్నారు. అనంతరం కార్మికులకు సహపంక్తి భోజనాలను ఏర్పాటు చేశారు. ఏజెంట్ చిలుక శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆర్‌జీ-1 జీఎం లలిత్ కుమార్, అధికారుల సంఘం అధ్యక్షుడు మల్లేషం, సంక్షేమాధికారి రవీందర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్

- ఓసీపీ-3 ప్రాజెక్టు, సీహెచ్‌పీల్లో జరిగిన కార్య క్రమంలో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ మాట్లాడారు. రామగుండం పారిశ్రామిక ప్రాంతం సింగరేణి మనుగడతో ముడిపడి ఉన్నట్టు పేర్కొన్నారు. ఇతర రంగాలకు సింగరేణి విస్తరించడం వలన ఉపాధి అవకాశాలు దొరకడంతో పాటు, పారిశ్రామికంగా రాష్ట్ర అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈదిశగా రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన చేస్తున్నట్టు మక్కాన్‌సింగ్ తెలిపారు. కార్మికుల సొంత ఇంటి కలను ఆకారం చేసేందుకు ఉన్న అవకాశాలను పరిశీలిస్తున్నట్టు పేర్కొన్నారు. అనంతరం ఆర్జీ-2 జీఎం సూర్యనారాయణ మాట్లాడారు. సింగరేణిలో పని సంస్కృతిలో విప్లవాత్మక మార్పులు వచ్చేలా ఉద్యోగులు సహకరించాలని అన్నారు. ఓసీపీలలో భారీ యంత్రాల పూర్తి పనిగంటలను వినియోగిస్తూ లక్ష్యాలకు అనుగుణంగా ఉత్పత్తి, ఉత్పాదకతను సాధించాల్సిన అవసరం ఉన్నదని అభిప్రాపడ్డారు. ప్రాజెక్టు స్థితిగతులు, యంత్రాల పనితీరు వంటి అంశాలపై అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం అధికారులు, కార్మికులతో సహపంక్తి భోజనంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమంలో గోదావరిఖని ఏసీపీ ఎం రమేష్, పీవో మధుసూదన్, ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ జీ రవీందర్, సీఎంవోఏఐ ప్రతినిధి జనార్దన్, అధికారులు, వివిధ విభాగాల ఉద్యోగులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉపాధి కల్పించడమే లక్ష్యం

- రామగుండంలో ఐటీ, ఏఐ స్కిల్ సెంటర్ల ఏర్పాటు
- ఓసీపీల్లో స్థానికులకే ఉపాధి అవకాశాలు...
- ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్



శిక్షణకు తీసుకెళ్లే బస్సుకు జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

గోదావరిఖని, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్టు రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్‌ఠాకూర్ చెప్పారు. సోమవారం ఆర్‌జీ-1 టీటీసీ ఆవరణలో సింగరేణి ఆధ్వర్యంలో జీఎంఆర్ వరలక్ష్మి సంస్థ 150మంది యువకులకు నైపుణ్యశిక్షణ అందించేందుకు హైదరాబాద్ సెంటర్‌కు తీసుకెళ్లే బస్సులను ఎమ్మెల్యే మక్కాన్ సింగ్, కలెక్టర్ కోయ శ్రీహర్ష జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత జాబ్ క్యాలెండర్‌ను తయారు చేసి దాని ప్రకారంగా ఉద్యోగ అవకాశాలను కల్పిస్తున్నట్టు తెలిపారు. ఇప్పటి వరకు 60వేల మందికిపైగా యువతకు ప్రభుత్వ ఉద్యోగాల నియామక పత్రాలను అందించామన్నారు. రామగుండంలో ఐటీ, ఏఐ స్కిల్ సెంటర్లను త్వరలో ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. దీనికి ఐటీశాఖ మంత్రి త్వరలోనే శంకుస్థాపన చేస్తారని చెప్పారు. ఎన్‌టీపీసీ, సింగరేణి, మెడికల్ కాలేజీ, ఆర్ఎఫ్‌సీఎల్‌లో స్థానికులకు ఉపాధి కల్పించేలా కలెక్టర్ చొరవ తీసుకోవాలని కోరారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ యువతకు నైపుణ్యమైన శిక్షణ అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, సింగరేణి ఆధ్వర్యంలో ఇక్కడ నైపుణ శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేశామని చెప్పారు. రెండు నెలల్లో అగ్నివీర్ నోటిఫికేషన్లు వస్తాయని, ఇందులో యువకులు పాల్గొనాలని, అగ్నివీర్‌కు వెళ్లే యువకులకు అవసరమైన శిక్షణను అందించేందుకు ప్రణాళిక చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఆర్‌జీ-1 జీఎం లలిత్‌కుమార్, గోదావరిఖని ఏసీపీ రమేష్, అధికారుల సంఘం అధ్యక్షుడు మల్లేషం, సేవా సమితి అధ్యక్షురాలు అనిత లలిత్‌కుమార్, కార్పొరేటర్లు పెద్దెల్లి తేజస్విని ప్రకాష్, మహంకాళి స్వామి, ముస్తాఫా పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడానికే స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్

మందమర్రిటౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కోల్‌బెల్ట్ ప్రాంతంలోని నిరుద్యోగులకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేశామని మందమర్రి జీఎం దేవేందర్ తెలిపారు. సోమవారం పట్టణంలోని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో కంప్యూటర్ డీటీపీ కోర్సులను ప్రారంభించి మాట్లాడారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పించడం కోసం కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీతోపాటు సామాజికబాధ్యతగా ఈ కార్యక్రమాన్ని సింగరేణి చేపట్టిందన్నారు. శిక్షణను సద్వినియోగం చేసుకుని ఉపాధి అవకాశాలు పొందాలన్నారు. రీజనల్ డైరెక్టర్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ ఎంట్రీ ప్రినూయరెన్స్ (ఆర్‌డీఎస్‌డీఈ) సంస్థతో ఈ శిక్షణ అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం రాజేశ్వర్‌రెడ్డి, ఏఐటీయూసీ మందమర్రి బ్రాంచీ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జీఎం దేవేందర్

కార్పొరేట్ జీఎంకు ఘన సన్మానం

శ్రీరాంపూర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ జనరల్ మేనేజర్(సీపీపీ)గా ఇటీవల బాధ్యతలు చేపట్టి ఎ మనోహర్‌ను శ్రీరాంపూర్ జీఎం బి సంజీవరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. సోమవారం ఆయన శ్రీరాంపూర్‌కు రాగా, ఆయనను సన్మానించి మాట్లాడారు. బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతలో మనోహర్ ఎంతో అను భవం కలిగిన వ్యక్తి అని కొనియాడారు.

దూరదృష్టితో పనిచేసే వ్యక్తిఅని తెలిపారు. కార్యక్రమంలో శ్రీరాంపూర్, ఇందారం పీవోలు శ్రీనివాస్, ఏవీరెడ్డి, ఏజెంట్లు గోపాల్‌సింగ్, రాముడు, శ్రీధర్, డీజీఎం(పర్సనల్) పి అరవింద రావు, ఏరియా రక్షణాధికారి శ్రీధర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.



జీఎంను సన్మానిస్తున్న అధికారులు